
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



ఖమ్మం

5

శుక్రవారం, 25 అక్టోబరు 2024



ఫేస్ టు ఫేస్

సమస్యలున్నాయి.. పరిష్కరిస్తున్నాం!

డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్, సూపరింటెండెంట్, ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రి

ప్రశ్న: జిల్లా జనరల్ ఆస్పత్రిలో వైద్యులు సిబ్బంది సమయ పాలన పాటించడం లేదని ఆరోపణలున్నాయి..?

జవాబు: ఆస్పత్రిలో బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తున్నాం. వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించేలా చర్యలు తీసుకుంటున్నాం. సమయ పాలనపై ప్రత్యేక దృష్టి సారించాం.

ప్ర: ఆస్పత్రిలో వైద్యుల కొరత వేధిస్తోంది కదా?

జ: ప్రస్తుతం రేడియాలజీ, గైనకాలజీ మరో రెండు మూడు విభాగాల్లో తప్ప వైద్యులు సరిపడా ఉన్నారు. కాంట్రాక్టు పద్ధతిలో ఇటీవలె కొంత మందిని తీసుకున్నాం. రేడియాలజీ విభాగానికి ఒక్కరూ కూడా లేరు.

ప్ర: ఓపీ విభాగాల వద్ద రోగులు నానా అవస్థలు పడుతున్నారు.. ఏం చర్యలు తీసుకుంటారు?

జ: సోమ, మంగళవారం రోజుల్లో రద్దీ ఉంటున్న మాట వాస్తవమే. మరో మూడు రెయిలింగ్‌ను, రెండు కంప్యూటర్లను, ఇద్దరు డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించి రోగులకు ఇబ్బంది లేకుండా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ప్ర: ఓపీ విభాగాల్లో హెచ్‌వోడీలు, వైద్యులు ఉండడం లేదంటున్నారు..?

జ: అదేం లేదు... హెచ్‌వోడీలు వార్డుల్లో, ఓపీల్లో, ఆపరేషన్ థియేటర్లలో ఇలా వివిధ రకాల విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. అందుకే ఒక్కో సారి అసిస్టెంట్లకు అప్పగించాల్సి ఉంటుంది. అంతే తప్ప హెచ్‌వోడీలు ఓపీలో అనుకూలమైన సమయాల్లో ఉంటున్నారు.

ప్ర: క్యాజువాలిటీల్లోనూ సేవలు జాప్యం అవుతున్నాయి... రాత్రి వేళల్లో వైద్యులు అందుబాటులో ఉండడం లేదని చెబుతున్నారు..?

జ: క్యాజువాలిటీలో డ్యూటీ డాక్టర్లు, మూడు షిఫ్టుల్లో ఉంటున్నారు. ఇక నుంచి విధుల్లో ఉండే డాక్టర్ల పేర్లు, వారి ఫోన్ నెంబర్లను క్యాజువాలిటీలో డిస్‌ప్లే చేస్తాం.

ప్ర: ఆస్పత్రిలో పారిశుధ్యం సక్రమంగా ఉండటం లేదు.. ఎందుకలా?

జ: వాస్తవమే... దీనిపై మాకు ఫిర్యాదులు అందుతున్నాయి. వీటిపై ప్రత్యేక దృష్టి సారించాం. కాంట్రాక్టును రద్దు చేయాలని ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రస్తుతం ఉన్న కాంట్రాక్టర్ వారి సిబ్బందికి వేతనాలు అందించక పోవడం ప్రతి నెలా ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

-ఆంధ్రజ్యోతి, ఖమ్మం కలెక్టరేట్



ధాన్యం కొనుగోళ్లపై కసరత్తు

జిల్లావ్యాప్తంగా 322 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

- ఆలస్యమవుతున్న వరి కోతలు
- 4.26 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యం
- సన్నరకానికి రూ.2,320తోపాటు రూ.500 బోనస్
- దొడ్డు రకానికి రూ.2300
- గ్యారంటీ ఉంటేనే మిల్లర్లకు ధాన్యం
- సీఎంఆర్ బకాయిలున్న మిల్లర్లకు నోటీసులు

ఖమ్మం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసినా జిల్లాలో ఇంకా ధాన్యం కొనుగోళ్ల ప్రారంభం కాని పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది వరిసాగు కొంత జాప్యం కావడం, నీటి ఎద్దడి రావడంతో వరికోతలు ఆలస్యమయ్యే పరిస్థితి నెలకొంది. జిల్లాలో ఈ వానాకాలం సాగులో సన్నాలు అత్యధికంగా వేశారు. సుమారు రెండున్నర లక్షల ఎకరాల్లో వరిసాగు జరిగింది. అయితే ఇంకా కోతల ప్రక్రియ వేగం పుంజుకోలేదు. ప్రస్తుతం ఏన్కూరు, కల్లూరు, సత్తుపల్లి ప్రాంతంలో అక్కడక్కడ వరికోతలు జరుగుతున్నాయి. జిల్లావ్యాప్తంగా పౌరసరఫరాల శాఖ 322 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించి ఇప్పటికే 35కేంద్రాలను ప్రారంభించారు. అయితే ఇప్పటివరకు ఒక్క క్వింటా కూడా కొనుగోలు చేయలేని పరిస్థితి. జిల్లాలో 4.26లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇందులో 3.90లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం కొనుగోలు చేయాలని, మిగిలినవి దొడ్డురకం కొనుగోలు చేయాలని నిర్ణయించారు. సన్నరకం క్వింటాకు రూ.2320కి కొనుగోలు చేయడంతోపాటు (మిగతా 6వ పేజీలో)

గ్యారంటీలు ఉంటేనే కోటా...

ఈఏడాది వానాకాలం సీఎంఆర్ ధాన్యం మిల్లులకు కేటాయింపుపై బ్యాంకు గ్యారంటీ ఇచ్చిన మిల్లులకు మాత్రమే ధాన్యం ఇవ్వాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ నిర్ణయించారు. గ్యారంటీలు లేకుండా ధాన్యం ఇవ్వాలని మిల్లర్ల అసోసియేషన్ పట్టుబడుతున్నప్పటికీ మిల్లు యజమానులు ప్రభుత్వ ధాన్యాన్ని తీసుకుని దొడ్డిదారిన వ్యాపారం సాగిస్తున్నందున, బ్యాంకు గ్యారంటీలు సమర్పించిన మిల్లులకు మాత్రమే ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం వెళ్లే అవకాశం ఉంది. సివిల్ సప్లయ్ గోదాములు, ఇతర గోదాముల్లోకి రైతులు తెచ్చిన ధాన్యాన్ని, కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలుచేసి ప్రభుత్వ గోదాములకు తరలించాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. దీంతో బ్యాంకు గ్యారంటీలు ఇవ్వని మిల్లర్లకు ఈఏడాది ధాన్యం మిల్లింగ్‌కు తీసుకునే అవకాశం కనిపించడంలేదు.

ప్రభుత్వస్థాయిలో బకాయిలు లేని మిల్లులకే ధాన్యం ఇవ్వాలని, గతంలో సీఎంఆర్ బకాయి ఉన్న మిల్లులకు మాత్రం గ్యారంటీలుంటేనే ధాన్యం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. అయితే జిల్లా యంత్రాంగం మాత్రం మిల్లర్లు చేస్తున్న అక్రమాలు దృష్టిలో పెట్టుకుని గ్యారంటీ ఉంటేనే మిల్లుకు ధాన్యం అన్న నిబంధన పెట్టారు. రైతులనుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలనుంచి సివిల్ సప్లయ్ గోదాములకు తరలించి నిల్వ ఉంచబోతున్నారు. ఎంత బ్యాంకు గ్యారంటీ ఇస్తే అంతమేర ధాన్యాన్ని అప్పగించి, సీఎంఆర్ ధాన్యాన్ని బియ్యంగా మార్చి అప్పగించిన తర్వాతనే మరో కోటా కింద ధాన్యాన్ని రెండోసారి ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు.

నేడు గవర్నర్ పర్యటన

- భద్రాచలం, కొత్తగూడెం, ఖమ్మంలో వివిధ కార్యక్రమాలకు హాజరు
- ముస్తాబైన భద్రాద్రి క్షేత్రం
- ఇరుజిల్లాల కలెక్టరేట్లలో సమావేశాలు



స్వాగతం పలుకుతున్న భద్రాద్రి కలెక్టర్, ఎస్పీ

భద్రాచలం/బూర్గంపాడు/ఖమ్మం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ శుక్రవారం ఖమ్మం రానున్నారు. ఉదయం భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయ దర్శనం అనంతరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 1గంటకు ఖమ్మం చేరుకుంటారు. ఎన్‌ఎస్‌పీ గెస్ట్‌హౌస్‌లో విశ్రాంతి అనంతరం కలెక్టరేట్‌కు వెళ్లి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం పలురంగాలకు చెందిన ప్రముఖులతో సమావేశమవుతారు. సాయంత్రం 4గంటలకు హైదరాబాదుకు బయలుదేరి వెళతారు. గవర్నర్ రాక సందర్భంగా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనలో భాగంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గురువారం (మిగతా 6వ పేజీలో)

ఇదీ షెడ్యూల్..

- ఉదయం 8గంటలకు భద్రాచలం ఆలయంలో పూజలు
- 9గంటలకు కొత్తగూడెం కలెక్టరేట్‌లో అధికారులతో భేటీ
- 10 గంటలకు కొత్తగూడెం కలెక్టరేట్‌లో భిన్న వర్గాల ప్రముఖులు, కళాకారులు, రచయితలతో సమావేశం
- 11గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 1గంట వరకు ఖమ్మంలోని ఎన్‌ఎస్‌పీ గెస్ట్‌హౌజ్‌కు చేరుకుంటారు. అక్కడే లంచ్.
- 2గంటలకు ఖమ్మం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశం
- మధ్యాహ్నం 3గంటలకు భిన్న వర్గాల ప్రముఖులు, కళాకారులు, రచయితలతో సమావేశం
- సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్ పయనం



కేఎంసీలో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పని చేయలేకుంటే సెలవుపై వెళ్లండి...

- మీలో ప్రతీ ఒక్కరి పనితీరు నాకు తెలుసు
- అక్రమ నిర్మాణాలకు పునాదులు పడకుండానే చర్యలు తీసుకోవాలి
- నిబంధనలు పాటించని బిల్డర్లు, కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్టులో పెట్టాలి
- పారిశుధ్య కార్యక్రమాలపై కార్యాచరణ ఉండాలి : కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- ఖమ్మం నగర పాలక సంస్థపై గరంగరంగా సమీక్ష

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): 'మీలో ప్రతీ ఒక్కరి పనితీరు నాకు తెలుసు.. నా నుంచి మీరు తప్పించుకోలేరు.. కచ్చితంగా పని చేయాల్సిందే.. మున్నేరు వరదలకు కారణం మీరే.. మీ వేతనాలకు కోత వేయించాల్సింది. కానీ చేయలేదు. మీ జాబ్ చార్టు మేరకు పనిచేయండి, పని చేయలేకుంటే సెలవ్‌పై వెళ్లండి..' అంటూ కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఖమ్మం నగర పాలక సంస్థ విభాగాల అధికారులను హెచ్చరించారు.

కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజలతో కలిసి ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్, పారిశుధ్యం, రెవెన్యూ విభాగాల అధికారులతో గంటన్నరపాటు సమీక్ష నిర్వహించారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవటంలో అధికారులు విఫలం చెందటంతోనే మున్నేరు వరద పోటు ఖమ్మంలోకి వ్యాపించిందని, ఖానాపురం ఊరచెర్వు నీరు పలు డివిజన్లపై చేరి అతలాకుతలం చేసిందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రైవేట్ కాలేజీల అక్రమ నిర్మాణాలను ఎందుకు అడ్డుకోలేక పోయారని టౌన్ ప్లానింగ్ అధికారిని కలెక్టర్ ప్రశ్నించారు. అక్రమ నిర్మాణాలు జరిగి, భవనాలు ప్రారంభమైన తర్వాత నోటీసులు ఇవ్వటం కాదని పునాదుల సమయంలో అడ్డుకోవాలని, నిబంధనలు పాటించని బిల్డర్లు, కాంట్రాక్టర్లు ఉంటే వారిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని ఆదేశించారు. కేఎంసీ అనుమతులు లేకుండా వీధుల వెంట భారీ ఫ్లెక్సీలు, హోర్డింగ్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారని వాటిని అడ్డుకోవాల్సిన బాధ్యత అధికారులపై లేదా అని ప్రశ్నించారు. టౌన్ ప్లానింగ్ విభాగం పేదల పట్ల మానవత్వంతో పనిచేయాలని సూచించారు. పేదల విషయంలో నోటీసులు ఇవ్వకుండా ఎటువంటి కూల్చీవేతలు చేపట్టవద్దని సూచించారు. కూల్చీ వేతల సమయంలో అక్రమ నిర్మాణదారులకు ముందస్తు సమాచారం ఇచ్చి పోలీసులను వెంట తీసుకొని వెళ్తున్నారని నిలదీశారు.

20శాతం మంది పారిశుధ్య కార్మికులు పని చేయకుండానే హాజరు నమోదు చేస్తున్నారు. పనితీరు మార్చుకోవాలని, చెత్త ఎక్కువగా ఉండే ప్రాంతాలను హాట్‌స్పాట్‌లుగా గుర్తించి (మిగతా 6వ పేజీలో)

మధిరకు ఎట్టకేలకు 'న్యాయ'ం

- రేపు సబ్ కోర్టును ప్రారంభించనున్న హైకోర్టు న్యాయమూర్తులు
- రూ.24 కోట్లతో నిర్మించనున్న భవనానికి శంకుస్థాపన
- సాకారమైన దశాబ్దాల నాటి కల

7



రేపు, ఎల్లుండి 'ఐలు' మహిళా సదస్సు

- హాజరుకానున్న హైకోర్టు న్యాయాధికారి సుధ

ఖమ్మం లీగల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత న్యాయవాదుల సంఘం(ఐలు) తెలంగాణ రాష్ట్ర మహిళా సదస్సు ఈ నెల 26, 27 తేదీల్లో ఖమ్మం నగరంలో జరగనుంది. స్థానిక సప్తపది ఫంక్షన్ హాల్లో శనివారం ఉదయం 10.30గంటలకు సభ ప్రారంభం అవుతుందని రిసెప్షన్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శి నల్లమల నవీన్‌చైతన్య, మీసాల వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం సాయత్రం 5.30 గంటలకు హైకోర్టు న్యాయాధికారి పి.సుధ ప్రత్యేక అంశంపై ప్రసంగిస్తారని తెలిపారు. ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్, ఐలు గౌరవ అధ్యక్షులు జి.విద్యాసాగర్, కొల్లి సత్యనారాయణ, సీహెచ్.శైలజ హాజరవుతారని, 27న మహిళా ప్రతినిధుల సభ ఉంటుందని తెలిపారు.

నేడు మాలల మహా పాదయాత్ర షురూ

- భద్రాద్రి నుంచి హైదరాబాద్ వరకు
- ప్రారంభించనున్న మాజీ ఎంపీ హర్షకుమార్



భద్రాచలం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దళితుల ఐక్యత కోసం మాలల మహాపాదయాత్ర నిర్వహిస్తున్నట్టు జాతీయ మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రకటించింది. భద్రాచలం నుంచి హైదరాబాద్‌కు ఈ పాదయాత్ర సాగనుండగా శుక్రవారం భద్రాచలంలోని అంబేద్కర్ సెంటరు వద్ద ఈ యాత్ర ప్రారంభంకానుంది. 38రోజుల్లో వెయ్యి కి.మీ., 16 జిల్లాలు, 35 నియోజకవర్గాల్లో ఈ పాదయాత్ర సాగనుండగా డిసెంబరు ఒకటిన ముగియనుంది. యాత్ర ముగింపు హైదరాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం నుంచి సభాస్థలిలోని రవీంద్రభారతి వరకు పాదయాత్ర చేపట్టనున్నారు. యాత్ర ముగింపు పురస్కరించుకొని మాలల మహా సంగ్రామసభ నిర్వహించనున్నట్టు జాతీయ మాలమహానాడు తెలంగాణ రాష్ట్ర కమిటీ ఇప్పటికే ప్రకటించింది. మాలమహానాడు తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు పిల్లి సుధాకర్ జాతీయ ప్రధాన కార్యదర్శి బైరి రమేష్‌తోపాటు ఇతర ప్రముఖ నాయకులు పాల్గొననున్నారు.

29న డయల్ యువర్ ఆర్ఎం

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి):ఈనెల 29న ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆర్ఎం సరిరాం తెలిపారు.ఈ సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో ఆర్టీసీ బస్సులకు సంబంధించిన సమస్యలను, సలహాలు, సూచనలు 99592 25953 నెంబరుకు ఫోన్ చేసి తెలపాలని కోరారు.



నేడు కోదండరామ్ రాక

చుంచుపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జనసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరామ్ శుక్రవారం భద్రాద్రి జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు పాల్వంచలోని కేటీపీఎస్ ఇంజనీర్స్ అసోసియేషన్ హాల్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3గంటలకు టీజేఎస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 4గంటలకు రుద్రంపూర్‌లో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులతో మాట ముచ్చట కార్యక్రమంలో పాల్గొంటారు. జిల్లాలోని తెలంగాణ ఉద్యమకారులు, టీజేఎస్ కార్యకర్తలు, నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని పార్టీ ప్రధాన కార్యదర్శి మల్లెల రామనాథం కోరారు.

బీఆర్ఎస్ నేత అరెస్టు.. ఉద్రిక్తత...

విధులకు ఆటంకం కలిగించిన కేసులో పుల్లయ్యపై పోలీసుల చర్య

- పొద్దుటూరులో అరెస్టు చేసి తీసుకెళ్తుండగా అడ్డుకున్న గ్రామస్థులు
- పోలీసుల తీరుతో తీవ్ర అస్వస్థతకు గురైన పుల్లయ్య భార్య
- పలు ప్రాంతాల మీదుగా తిప్పుతూ వైరా పోలీస్‌స్టేషన్‌కు తరలింపు
- పోలీసుల తీరుపై జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజ్ ఆగ్రహం
- మధిర రూరల్, వైరా పోలీస్‌స్టేషన్ల ముందు ఆందోళనకు దిగిన పార్టీ శ్రేణులు


చింతకాని/మధిర రూరల్/వైరా, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ చింతకాని మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య అరెస్టు ఘటన గురువారం తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. పోలీసుల తీరు హైడ్రామాను తలపించగా, బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనలకు దిగాయి. చింతకాని మండలంలోని పొద్దుటూరుతో పాటు మధిర, వైరాల్లో పోలీసుల చర్య కలకలం రేపింది. కారులో మఫ్టీలో వచ్చిన నలుగురు ఎస్ఐలు, ఒక సీఐ... అయ్యప్ప మాలలో ఉన్న పుల్లయ్యను బలవంతంగా తీసుకెళ్తుండగా, ఆయన భార్య తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. వివరాల్లోకి వెళ్తితే...



మాట్లాడుతున్న కమల్‌రాజ్

చింతకాని మండలం పొద్దుటూరులో గల బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య ఇంటికి గురువారం మధ్యాహ్నం వైరా సీఐ సాగర్ నేతృత్వంలో వైరా, కొణిజర్ల, తల్లాడ, బోనకల్ ఎస్ఐలు మఫ్టీలో వచ్చారు. ఇంట్లో వున్న పుల్లయ్యను ఒక్కసారిగా అదుపులోకి తీసుకున్నారు. ఆయన అయ్యప్పమాలలో ఉన్నారు. అనంతరం కారులోకి ఎక్కించి తరలిస్తుండగా... ఏ కారణం చేత తీసుకువెళ్తున్నారో తెలియజేయాలని గ్రామస్థులు, కుటుంబ సభ్యులు కారుకు అడ్డం తిరిగారు. దీంతో కాసేపు ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. అయితే పోలీసులు కారుకు అడ్డుగా నిలబడిన వారిని పక్కకు నెట్టి ముందుకు కదిలారు.

మండలంలోని లచ్చగూడెం గ్రామంలో ఈ నెల 5న జరిగిన ఘటన పుల్లయ్య అరెస్టుకు దారి తీసింది. ఆ రోజు లచ్చగూడెంలో విద్యుదాఘాతానికి గురై గూని ప్రసాద్ అనే రైతు మృతిచెందాడు. ఘటనపై కుటుంబ సభ్యులు, గ్రామస్థులు మృతదేహంతో కొదుమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు ధర్నా చేశారు. అధికారులు స్పందించకపోవడంతో మృతదేహాన్ని కలెక్టర్ కార్యాలయానికి తరలించి ధర్నా చేసేందుకు సిద్ధమయ్యారు. మృతదేహాన్ని ట్రాక్టర్‌లో ఎక్కించుకుని ఖమ్మం వెళ్తుండగా పోలీసులు (మిగతా 6వ పేజీలో)



పుల్లయ్యను అరెస్టు చేసి తీసుకువెళ్తున్న పోలీసులు

పుల్లయ్యకు 14 రోజుల రిమాండ్

ఖమ్మం లీగల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన కేసులో బీఆర్ఎస్ నేత పుల్లయ్యతోపాటు మరొకరికి ఖమ్మం మూడో అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయాధికారి వినుకొండ మాధవి 14రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. చింతకాని మండలం లచ్చగూడెంలో ఈ నెల 5న ఉదయం నల్లచెరువు వద్ద గూని ప్రసాద్ అనే వ్యక్తి విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. ఈ క్రమంలో ప్రసాద్ మృతదేహాన్ని ట్రాక్టర్‌పై ఎక్కించుకొని కొదుమూరు సబ్‌స్టేషన్ ముందు కొందరు వ్యక్తులు బైఠాయించగా, చింతకాని సీఐ తన సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని తరలించేందుకు ప్రయత్నించారు. అయితే అక్కడున్న వారు పోలీసులను అడ్డుకున్నారు. ఈ ఘటనపై చింతకాని ఎస్ఐ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో గూని నరేష్, పెంట్యాల పుల్లయ్యను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి రిమాండ్ విధించారు. నిందితులను భారీ బందోబస్తు మధ్య జిల్లా జైలుకు తరలించారు.

కక్ష సాధింపా..? రాజకీయ కారణాలా..?

- పుల్లయ్య అరెస్టు, పోలీసుల హైడ్రామాపై భిన్న రకాల చర్చలు
- మీడియాకు ముఖం చాటేసిన పోలీసు అధికారులు

6



కొత్తగూడెంలో రోగులతో కిటకిట లాడుతున్న ఇన్‌పేషెంట్ విభాగం
పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్ గది వద్ద వేచి ఉన్న రోగులు

మాకొద్దుబాబు.. సర్కార్ వైద్యం

- సమస్యలతో సతమతం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రులు
- వైద్యులు, మందుల కొరతతో ఇబ్బంది పడుతున్న రోగులు
- పాల్వంచ ఆసుపత్రికి అంబులెన్స్ కూడా కరువు
- సమయం పాటించని వైద్య సిబ్బంది
- భద్రాద్రి జిల్లా ఏరియా ఆసుపత్రిల్లో 'ఆంధ్రజ్యోతి' విజిట్
- వెలుగు చూసిన పలు సమస్యలు

కొత్తగూడెం/పాల్వంచ/ఇల్లెందు/మణుగూరు/అశ్వరావుపేట/భద్రాచలం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లాలోని ఏరియా ఆస్పత్రులతోపాటు జిల్లాకేంద్రంలోని ప్రధాన ఆస్పత్రి సమస్యలకు కేంద్రాలుగా మారాయి. సమయం పాటించని వైద్య సిబ్బంది, అధికారులు, మందుల కొరతతో రోగులు సతమతమవుతున్నారు. వైద్యులకొరత వల్ల ఆసుపత్రికి వచ్చే రోగులకు సర్కార్ వైద్యం అందని ద్రాక్షగా మారింది. పాల్వంచ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి ఏమర్జెన్సీ సమయంలో కావాల్సిన అంబులెన్స్ కూడా లేదు. అశ్వారావుపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్యుల కొరత విపరీతంగా ఉంది. జిల్లాలో కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు, అశ్వారావుపేట, పాల్వంచ, భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పలు సమస్యలు దర్శనమిస్తున్నాయి. ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య భారీగా ఉన్నా అందుకు తగ్గట్లు ఆస్పత్రి వైద్య, సిబ్బంది లేకపోవడంతో రోగులకు సరైన వైద్యం అందడం లేదు. వైద్యులు సమయం పాటించకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తగూడెం జీజీహెచ్ సమస్యల సుడిలో కొట్టుకుంటోంది. ఇక్కడికి ఒక రోగంతో వెళితే మరిన్ని రోగాలు అంటే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. జీజీహెచ్ అపరిశుభ్రతకు నిలయంగా మారింది. అస్తవ్యస్థంగా బయో వ్యర్థాలు పడి ఉండటం, ఆస్పత్రికి మరమ్మతులు లేక శిథిలావస్థకు చేరుకుంది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవండంతో మురుగునీరు భారీగా నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. పనిచేయని బెడ్లు తదితర సామగ్రిలు భారీగా ఆస్పత్రిలో దర్శనమిస్తున్నాయి. ఇటీవల బదిలి అయిన రేడియాలజిస్ట్ స్థానంలో కొత్తవారిని తీసుకోపోవడంతో ఆ గదికి తాళం వేసి ఉంచారు. మందులు సరిపడా అందుబాటులో లేకపోవడంతో రోగులు ప్రైవేటును ఆశ్రయిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా గురువారం నిర్వహించిన 'ఆంధ్రజ్యోతి' విజిట్ కార్యక్రమంలో పలు వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి.

పాల్వంచలో వీడని వైద్యుల కొరత

పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రిలో మందుల కొరత వేధిస్తోంది. ఇక్కడికి రోజుకు సుమారు 600నుంచి 700మంది వరకు రోగులు వస్తుంటారు. 50 పడకల ఆస్పత్రిగా ఉండి సేవందిస్తున్న ఈ ఆస్పత్రిలో ఇంకా వైద్యుల అవసరం ఉంది. ఇప్పటికే 17మంది వైద్యులు సేవలు అందిస్తుండగా మరో గైనకాలజిస్టు, జనరల్ సర్జన్, డ్యూటీ మెడికల్ ఆఫీసర్, ఈఎన్‌టీ వైద్యుల అవసరం ఉంది. ఆస్పత్రిలో మందుల కొరత తీవ్రంగా ఉంది.

అశ్వారావుపేటలో సౌకర్యాలు నిల్

అశ్వారావుపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సరిపడా వైద్యులు, సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోజు 130 నుంచి 150వరకు ఓపీ నమోదవుతోంది. ప్రస్తుతం 10బెడ్స్ మాత్రమే అందుబాటులో ఉండటంతో అత్యవసరమైన ఇన్‌పేషెంట్లకు మాత్రమే వైద్యం చేయగలుగుతున్నారు. ఇది 30 పడకల ఆస్పత్రి అయినా భవనాలు సరిపడా లేకపోవడంతో పది పడకలు మాత్రమే ఉపయోగిస్తున్నారు. ఇన్ పేషెంట్లుకు భవనం లేకపోవడంతో వెయింటింగ్ హాల్‌లోనే బెడ్‌లు వేసి వైద్యం చేస్తున్నారు. ఈ ఆస్పత్రికి మొత్తం 17మంది వైద్యులను కేటాయించగా కేవలం ఏడుగురు మాత్రమే ఉన్నారు.

100పడకల ఆస్పత్రి అయిన ఇల్లెందు వైద్యశాలలో రోగులకు తాగునీటి సరఫరా నామామాత్రంగానే ఉంది. సివిల్ సర్జన్, గైనకాలజిస్టు, చిన్నపిల్లల వైద్యుల పోస్టులు భర్తీ చేయలేదు. పేరుకు మాత్రమే 100పడకల ఆస్పత్రిగా ఉంది. ఇక్కడ సాధారణ జ్వర బాధితులే అధికంగా వస్తుంటారు. ఆస్పత్రిలో కేవలం డయాలసిస్ కేంద్రానికి మాత్రమే జనరేటర్ సౌకర్యం ఉంది. వైద్యులు, సిబ్బంది సమయం పాటించడం లేదు.

ఈ ఆస్పత్రికి అంబులెన్స్ కూడా లేదు..

మణుగూరులోని 100పడకల ఏరియా ఆస్పత్రిలో వైద్యులకొరత తీవ్రంగా ఉంది. రోజుకు 300నుంచి 500 మంది రోగులు వస్తున్నా వారికి సరిపడా వైద్యులు లేరు. ఇక్కడ మొత్తం 27మంది వైద్యులు ఉండాల్సి ఉండగా కేవలం ఏడుగురు మాత్రమే ఉన్నారు. 40మంది నర్సులకు 20మంది మాత్రమే ఉన్నారు. సరిపడా ల్యాబ్ టెక్నీషియన్లు లేకపోవడంతో ఆస్పత్రిలో వైద్య పరీక్షల నిర్వహణ కష్టతరంగా మారింది. ఈ ఆస్పత్రికి అంబులెన్స్ సౌకర్యం కూడా లేదు. మార్చురీకి వాహనం ఉన్నా డీఎంహెచ్‌వో అనుమతి లేనిదే అది అంగుళం కూడా కదలదు. 100 పడకల ఆస్పత్రిలో విద్యుత్ పోతే అంధకారమే.. జనరేటర్ లేకపోవడంతో శస్త్ర చికిత్స చేస్తున్న తరుణంలో కరెంట్ పోతే కేవలం సెల్‌ఫోన్ల లైట్లతో ఆపరేషన్ కొనసాగిస్తున్నారు.

భద్రాచలం ఏరియా వైద్యశాలలో సమయపాలనకు పాతర

ఇక నాలుగు రాష్ట్రాలకు ప్రధాన కూడలిలో ఉన్న భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో వైద్యులు సమయపాలన పాటించడంలేదనే విమర్శలున్నాయి. ప్రతిరోజు ఔట్‌పేషెంట్ సమయం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉండగా వైద్యులు నిర్ణీత సమయంలో రావడం లేదని తెలుస్తోంది. ఏరియా వైద్యశాలలో 208 పోస్టులకు 93పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రధానంగా 12సివిల్ సర్జన్‌పోస్టులు, 7 డిప్యూటీ సివిల్ సర్జన్, 6సివిల్ అసిస్టెంట్ సర్జన్‌పోస్టులు ఖాళీగా ఉన్నాయి. హెడ్‌నర్స్ పోస్టులు 4, స్టాఫ్‌నర్సు పోస్టులు 27ఖాళీగా ఉండటం గమనార్హం. వైద్యశాలలో రక్త పరీక్షలు నిర్వహిస్తుండగా అందుబాటులో లేని పరీక్షలకు టీహబ్‌కు శాంపిల్స్ పంపిస్తున్నారు. కాగా అత్యవసర సమయంలో అందుబాటులో లేని మందులను బయటకు రాస్తున్నట్లు రోగులు పేర్కొంటున్నారు.



ఏటీసీ కోర్సు అడ్మిషన్లకు
30 గడువు


119 భర్తీ, ఇంకా 53 ఖాళీలు

ఖమ్మం ఖానాపురంహవేలి అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఐటీఐలలో ఏర్పాటు చేస్తున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 30 వరకు తుది గడువు అని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ తెలిపారు. మొత్తం 172 సీట్లకుగాను గురువారం నాటికి 119సీట్లు భర్తీకాగా, ఇంకా 53 సీట్లు ఖాళీగా ఉన్నట్టు తెలిపారు. విద్యార్థులు వెంటనే నూతన కోర్సుల ప్రవేశాల కొరకు త్వరపడాలని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఐటీఐ కళాశాలల్లో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌లను ప్రారంభించిందని, జిల్లాలో ఉన్న ఐటీఐలలో కొత్త కోర్సులు మంజూరై ఆరు కోర్సులలో మొత్తం 170సీట్లకు అడ్మిషన్లు ప్రారంభించినట్టు తెలిపారు. ఈ కోర్సులలో ఉపాధి అవకాశాలు ఉంటాయని తెలిపారు. 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఈ కోర్సుల్లో అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. సంవత్సర కాల పరిమితి గల కోర్సులు మాన్యుఫ్యాక్చర్‌రింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫ్యాక్చర్‌రింగ్, ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్ టూల్స్ రెండేళ్ల కాల పరిమితి గల కోర్సులు బేసిక్స్ డిజైనర్ అండ్ డిజిటల్ మాన్యుఫ్యాక్చర్‌రింగ్, అడ్వాన్స్‌డ్ సీయన్‌సీ మిషనింగ్ టెక్నిషియన్, మోకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ కోర్సుల్లో సీట్లు ఖాళీలు ఉన్నాయని ఈ కోర్సులతో ఉపాధి అవకాశాలు కచ్చితంగా ఉంటాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 9100852344, 7095739332 నెంబర్లను విద్యార్థులు సంప్రదించాలని తెలిపారు.

108లో ప్రసవం..

- తల్లీ బిడ్డ క్షేమం
- సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపిన కుటుంబ సభ్యులు

కూసుమంచి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన శిరీష అనే మహిళ గురువారం 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. ఉదయం అకస్మాత్తుగా పురుటినొప్పులు రావడంతో కుటుంబసభ్యులు 108కు సమాచారం అందించారు. వెంటనే వారు వచ్చి గర్భిణిని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో నొప్పులు అధికమయ్యాయి. దీంతో శిరీష కుటుంబసభ్యుల సహాయంతో 108 ఎమర్జెన్సీ టెక్నీషియన్ అంబాల రాణి సాధారణ ప్రసవం చేశారు. శిరీషకు ఆడపిల్లకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు. అనంతరం వారిని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి గర్భిణికి ప్రసవం చేసిన టెక్నీషియన్ రాణిని, పైలెట్ శ్రీనుకు శిరీష కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.


అవిష్కరిస్తున్న దృశ్యం

'ఉపపురాణ దర్శనం' గ్రంథాన్ని ఆవిష్కరించిన గవర్నర్

భద్రాచలం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉప పురాణాలపై తెలుగులో వెలువడిన తొలి గ్రంథం ఉప పురాణ దర్శనం గ్రంథాన్ని రాష్ట్ర గవర్నరు జిష్ణుదేవ్ వర్మ ఆవిష్కరించారు. బూర్గంపాడు మండలం సారపాక ఐటీసీ అతిథిగృహానికి గురువారం సాయంత్రం చేరుకున్న ఆయన గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఉపపురాణ దర్శనం గ్రంథాన్ని భద్రాచలం దేవస్థానం రామాయణపారాయణదారులు ఎస్జీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు రచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నరు ముఖ్యకార్యదర్శి బి.వెంకటేశం, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, ఐటీడీఏ పీవో బి.రాహుల్, భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి పాల్గొన్నారు.

తలసీమియా వార్డు ప్రారంభించనున్న గవర్నర్


'రెడ్‌క్రాస్' ఏర్పాటు చేసిన తలసేమియా వార్డు

భద్రాచలం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ జిల్లాగా పేరొందిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని తలసీమియా, సికిల్‌సెల్ ఎనీమియాతో బాధపడుతున్న సుమారు 400మంది వ్యాధిగ్రస్తులకు భద్రాచలంలో ప్రత్యేక తలసీమియా, సికిల్‌సెల్ ఎనీమియా వార్డును ఏర్పాటు చేశారు. రెడ్‌క్రాస్ భవనంలో రూ.46లక్షలతో 20 బెడ్లతో ఈ ప్రత్యేక వార్డును రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు ఏర్పాటు చేశారు. రెడ్‌క్రాస్ జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు ఆయన సహచరులు ఇందుకోసం ప్రత్యేక కృషి చేశారు. గతంలో సైతం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో బ్లడ్ బ్యాంకును అందుబాటులోకి తీసుకురాగా... తాజాగా తలసేమియా, సికిల్‌సెల్ ఎనీమియా రోగుల కోసం ప్రత్యేక వార్డును ఏర్పాటు చేయడంతో అది నిరుపేదలకు ఎంతగానో ఉపయోగపడనుంది. ఇంతకాలం వ్యాధిగ్రస్తులు రక్తం ఎక్కించుకోవాలన్నా, చికిత్స పొందాలన్నా ఖమ్మం లేదా విజయవాడ తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ప్రత్యేకవార్డు అందుబాటులోకి రావడంతో వారికి భద్రాచలంలోనే చికిత్స అందించేందుకు మార్గం సుగమం అయింది. ఈ వార్డును శుక్రవారం గవర్నర్ ప్రారంభించనున్నారు.

5న స్థానిక సంస్థల్లో వెనుకబాటుతనంపై
ప్రజాభిప్రాయ సేకరణ

ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నవంబరు 5న స్థానిక సంస్థల్లో వెనుకబాటుతనంపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్టు, అన్ని వర్గాలకు చెందిన ప్రజలు, మేధావులు హాజరై వారి అభిప్రాయాలను తెలియజేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం స్థానిక సంస్థల్లో వెనుకబాటుతనం స్వభావం ప్రభావాన్ని, సమకాలిన, క్షుణ్ణమైన, అనుభవపూర్వక విచారణను నిర్వహించేందుకు ప్రత్యేక బీసీ కమిషన్ ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. నవంబరు 5న ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కలెక్టరేట్‌లో ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకునేందుకు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు, మేధావులు, కుల సంఘాలు ప్రతినిధులు హాజరై తమ అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు. ప్రజలు తమ అభిప్రాయాలను, అభ్యర్థనలను రాతపూర్వకంగా వెరిఫికేషన్ అఫిడవిట్‌తోపాటు 6 సెట్లలో తెలుగు లేదా ఆంగ్లం, ఏదైనా భాషలో తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్‌కి సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు గవర్నర్ పర్యటన


గౌరవవందనం స్వీకరిస్తున్న గవర్నర్

(5వ పేజీ తరువాయి)

బూర్గంపాడు మండల పరిధిలోని సారపాకలో గల ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నారు. రోడ్డు మార్గాన ఐటీసీకి చేరుకున్న గవర్నర్‌కు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్, భద్రాచలం దేవస్థానం ఈవో రమాదేవి స్వాగతం పలికారు. అనంతరం పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. గురువారం రాత్రి ఐటీసీలో బస చేశారు.

ముస్తాబైన భద్రాద్రి

భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి వారిని గవర్నర్ శుక్రవారం దర్శించుకోనున్నారు. శుక్రవారం ఉదయం ఆయన ఐటీసీ అతిథి గృహం నుంచి బయలుదేరి భద్రాచలంలోని రామాలయానికి చేరుకుంటారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కాగా గవర్నరు రాకను పురస్కరించుకొని భద్రాద్రి రామాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఎస్పీ రోహిత్‌రాజు ఆధ్వర్యంలో భారీ బందోస్తును ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి పోలీసు అధికారులు, సిబ్బంది భద్రాచలం చేరుకొని రిపోర్టు చేశారు. భద్రాద్రి పర్యటన ముగిసిన అనంతరం జిల్లా కలెక్టరేట్ సముదాయంలో అధికారులతో సమావేశం కానున్నారు. అలాగే కలెక్టరుచే ఎంపిక చేయబడిన రాష్ట్ర, జాతీయస్థాయికి చెందిన కవులు, కళాకారులు, రచయితలతో భేటీ కానున్నారు.

రామాలయానికి సరికొత్త శోభ

రాష్ట్ర గవర్నరుగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా జిష్ణుదేవ్ వర్మ రామయ్య దర్శనం కోసం భద్రాచలం పుణ్యక్షేత్రానికి వస్తున్న క్రమంలో రామాలయానికి సరికొత్త శోభ సంతరించుకొంది. గవర్నరు రాకను పురస్కరించుకొని కొబ్బరి, అరటి ఆకులు, బంతి పూలు, జరబర, ఆర్కెట్లు, వైట్‌డైజ్, ఎల్లోడైజ్, బ్లూడైజ్, లీవ్స్‌తో అలంకరించారు. ఆలయంలోకి ప్రవేశించే మార్గం, రాజగోపురం, ధ్వజస్తంభం వద్ద తదితర ప్రాంతాల్లో ప్రత్యేక పూల అలంకరణ చేశారు.


గవర్నర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న భద్రాచలం రామాలయం ఈవో రమాదేవి

బీఆర్‌ఎస్ నేత అరెస్టు.. ఉద్రిక్తత..

(5వ పేజీ తరువాయి)

అడ్డుకున్నారు. ఈ క్రమంలో ట్రాక్టర్ డ్రైవర్‌తోపాటు కొంత మంది గ్రామస్థులు.. పోలీసుల విధులకు ఆటంకం కలిగించారు. అయితే ఆ రోజు బీఆర్‌ఎస్ నాయకుల ప్రోద్భలంతోనే పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి గురువారం పోలీసులు పుల్లయ్యను అరెస్ట్ చేసినట్లు సమాచారం. కాగా, అయ్యప్ప మాలధారణలో ఉన్న పుల్లయ్యను అరెస్ట్ చేయడంతో అతని భార్య భారతమ్మ ఒక్కసారిగా అస్వస్థతకు లోనుకాగా, కుటుంబసభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

మధిర రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన

పొద్దుటూరులో పుల్లయ్యను అరెస్టు చేసిన పోలీసులు.. డైరెక్టు రూట్‌లో కాకుండా, వివిధ మండలాల మీదుగా మధిరరూరల్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నేత, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ పార్టీ శ్రేణులతో కలిసి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని నిరసన తెలిపారు. పుల్లయ్యను స్టేషన్ల చుట్టూ తిప్పుతూ ఎందుకు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ప్రశ్నించారు. ఆందోళనలో కమల్‌రాజ్‌తో పాటు నాయకులు చిత్తారు నాగేశ్వరరావు, బొగ్గుల భాస్కరరెడ్డి, అబ్బూరి రామన్, మేడిశెట్టి నాగేశ్వరరావు, అరిగే శ్రీను, రవి, అప్పారావు పాల్గొన్నారు.

వైరాలో ఉద్రిక్తత

పుల్లయ్యను పోలీసులు అదుపులోకి తీసుకోవడం ఉద్రిక్తతకు దారితీసింది. పుల్లయ్యను పొద్దుటూరులోని తన ఇంట్లో అయ్యప్పమాల దీక్షలో ఉండగా అదుపులోకి తీసుకున్న అనంతరం ఖమ్మం, బోనకల్, మధిర తదితర ప్రాంతాల్లో తిప్పి ఏపీలోని గంపలగూడెం మండలంలోని తదితర ప్రాంతాల గుండా తిప్పుతూ సాయంత్రానికి వైరా పోలీస్ సర్కిల్ కార్యాలయానికి తీసుకువచ్చారు. వైరా, కల్లూరు ఏసీపీలు ఎంఏ.రెహ్మాన్, రఘు, వైరా, మధిర సీఐలు ఎన్.సాగర్, మధు, టాస్క్‌ఫోర్స్ సీఐ, పలు స్టేషన్ల ఎస్‌ఐలు, సిబ్బంది, మహిళా కానిస్టేబుళ్లను వైరాలో మోహరించారు.

ఇదే సమయంలో జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, మధిర బీఆర్‌ఎస్ నేతలు వైరా చేరుకొని ఏసీపీతో చర్చించారు. లచ్చగూడెంలో గూని ప్రసాద్ దుర్మరణం సందర్భంగా జరిగిన సంఘటనలో పోలీసుల పట్ల పుల్లయ్య ప్రోత్సాహంతో గూని నరేష్ అనే వ్యక్తి దురుసుగా ప్రవర్తించాడని, ఆ ఘటనపై నమోదుచేసిన కేసులో అరెస్టు చేసినట్లు కమల్‌రాజ్‌కు తెలిపారు. అనంతరం కమల్‌రాజ్ బయటకు వచ్చి రోడ్డుపైన గుమిగూడిన పొద్దుటూరు బీఆర్‌ఎస్ శ్రేణులకు పరిస్థితిని వివరించారు. దీంతో నాయకులు పోలీసుల వైఖరిని తీవ్రంగా ఖండించారు. సాయంత్రం ఆరుగంటల తర్వాత పుల్లయ్య, నరేష్‌ను సీఐ సాగర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు మధ్య ఖమ్మం కోర్టుకు తరలించారు.

కక్ష సాధింపా..? రాజకీయ కారణాలా..?

- పుల్లయ్య అరెస్టు, పోలీసుల హైడ్రామాపై భిన్న రకాల చర్చలు



వైరా, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పుల్లయ్య అరెస్టు వ్యవహారంలో పోలీసులు హైడ్రామా కొనసాగించారు. పుల్లయ్యపై బీఎన్ఎస్ కింద 11సెక్షన్లు, ఐపీసీ కింద 11సెక్షన్లు నమోదు చేశారు. అయితే పుల్లయ్య అరెస్టు వెనుక ఎవరి ప్రమేయం ఉందనే దానిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఒక వేళ కక్ష సాధింపే అయితే అది పోలీసులదా..? అధికార పార్టీ నేతలదా అనే దానిపై చర్చ జరుగుతోంది.

పుల్లయ్య దాదాపు 25సంవత్సరాలు పొద్దుటూరు సర్పంచ్‌గా పనిచేశారు. ఆయన భార్య ఐదు సంవత్సరాలు ఎంపీటీసీగా పనిచేశారు. దాదాపు 40సంవత్సరాల నుంచి పుల్లయ్య క్రియాశీలక రాజకీయాల్లో ఉన్నారు. స్వతహాగా టీడీపీ నేత అయిన పుల్లయ్య 2014లో తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయన ప్రస్తుతం బీఆర్‌ఎస్‌లోనే చింతకాని మండల పార్టీ అధ్యక్షుడిగా ఉన్నారు.

గతనెలలో భారీ వర్షాల సమయంలో చింతకాని మండలం లచ్చగూడెంలోని పొలాల్లో విద్యుత్ తీగలు తెగిపోయి పంటపొలాల్లో పడిపోయా యి. ఈ విషయాన్ని గ్రామానికే చెందిన గూని ప్రసాద్ ఆయన సోదరులు ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేశారు. మూడు రోజుల తర్వాత (ఈ నెల5న) సోదరుడితో కలిసి ప్రసాద్ పొలంలోకి వెళ్లగా విద్యుదాఘాతంతో మృతిచెందాడు. దీంతో ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మృతుడి బంధువులు కొదుమూరు సబ్‌స్టేషన్ ముందు ఆందోళన చేపట్టారు. ఆ సమయంలో పెంట్యాల పుల్లయ్య కూడా వారితో జతకలిశారు.

మృతుడి సమీప బంధువైన యువకుడు గూని నరేష్ ట్రాక్టర్‌పై ప్రసాద్ మృతదేహాన్ని కలెక్టరేట్ వద్దకు తీసుకువెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. ఆ సమయంలో నరేష్ ఆవేశంతో ట్రాక్టర్‌ను సీఐ సహా సర్కిల్‌లోని నలుగురు ఎస్‌ఐలపైకి దూకించేందుకు ప్రయత్నించాడని చెబుతున్నారు. పుల్లయ్య ప్రోత్సాహంతోనే నరేష్ దూకుడుగా వ్యవహరించాడని పోలీసులు చెబుతున్నారు. అప్పుడు సంయమనంతో ఉన్న పోలీసులు.. గురువారం రంగంలోకి దిగారు. పుల్లయ్య ఇంట్లో ఉన్నారనే సమాచారంతో వైరా, కల్లూరు ఏసీపీలు ఎంఏ రెహ్మాన్, రఘు ఆధ్వర్యంలో వైరా సీఐ ఎన్.సాగర్ స్వయంగా సబ్‌డివిజన్‌లోని ఎస్‌ఐలు, సిబ్బందితో కలిసి పొద్దుటూరు వెళ్లారు. ఒక్క వైరా ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్ మాత్రమే యూనిఫామ్‌లో ఉన్నారు. మిగిలిన సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది మఫ్టీలోనే అక్కడకు చేరుకున్నారు. అయ్యప్ప మాలధారణలో ఉన్న పుల్లయ్య పీటం నుంచి ఇంటికి చేరుకున్న వెంటనే, పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఓ ప్రైవేట్ వాహనంలోకి ఎక్కించి తీసుకెళ్లుతుండగా, అక్కడున్న వారు అడ్డుకోగా వారిని ఈడ్చిపడేశారు.

పుల్లయ్యపై నమోదైన కేసు సాధారణమే అయినా, పోలీసులు ఇంత హైడ్రామా ఎందుకు చేశారనేది ఆసక్తిగా మారింది. కొన్నినెలల కిందట పొద్దుటూరులో ప్రభాకర్‌రావు అనే రైతు ఆత్మహత్య ఘటనలో పుల్లయ్యపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ తర్వాత లచ్చగూడెం ఘటన చోటుచేసుకుంది. ఈ క్రమంలోనే పుల్లయ్యపై గతంలో నమోదైన కేసుల చిట్టాను పోలీసులు బయటకు తీశారని ప్రచారం జరుగుతోంది. పుల్లయ్య అరెస్టు, హైడ్రామా వెనుక ఉన్నది రాజకీయ కారణాలా..? పోలీసుల కక్ష సాధింపా..? అనేది తేలాల్సివుంది. ఇదిలావుండగా, వివిధ కేసులను ఛేదించిన సందర్భాల్లో మీడియా సమావేశాలు ఏర్పాటుచేసి హడావిడి చేసే పోలీసు అధికారులు.. పుల్లయ్య ఘటనకు సంబంధించి విలేకరులు అనేకసార్లు ఫోన్లు చేసినప్పటికీ కనీసం స్పందించలేదు. ఇదీ మిస్టరీగానే ఉంది.

ధాన్యం కొనుగోళ్లపై కసరత్తు

(5వ పేజీ తరువాయి)

రూ.500బోనస్ కూడా అందించనున్నారు. దొడ్డు రకానికి రూ.2300 ధర నిర్ణయించారు. జిల్లాలో గతేడాది ఖరీఫ్, రబీ సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ బియ్యం ఎఫ్‌సీఐ, సివిల్ సప్లయ్ గోదాంలకు పంపని 27 మిల్లులకు జిల్లా పౌరసరఫరాల శాఖ నోటీసులు జారీచేసింది. వారంలోగా మిగిలి ఉన్న ధాన్యానికి సంబంధించి బియ్యాన్ని పంపించాలని పెండింగ్ సీఎంఆర్ బియ్యాన్ని పంపని మిల్లులకు నోటీసులు జారీచేశారు. జిల్లాలో సుమారు. రూ.55 కోట్ల విలువైన ధాన్యానికి సంబంధించి మిల్లుల వద్ద ఇంకా పెండింగ్ ఉన్నట్టు సమాచారం. కొణిజర్ల మండలంలో గతనెలలో సీఎంఆర్ ధాన్యం రూ.81 కోట్ల విలువైన ధాన్యం ఎస్‌ఏఆర్ మిల్లు నుంచి గల్లంతు కావడంతో ఆ మిల్లును సీజ్ చేసిన విషయం విదితమే. సీఎంఆర్ ధాన్యంకు సంబంధించిన బియ్యాన్ని ఇంకా పలు రైసుమిల్లుల నుంచి ప్రభుత్వానికి జమ చేయాల్సి ఉంది. అయితే కొత్తగా మళ్లీ ధాన్యం వస్తున్నందున పెండింగ్‌లోని మిల్లుల యజమానులందరికీ నోటీసులు జారీచేశారు.

పని చేయలేకుంటే
సెలవుపై వెళ్లండి...

(5వ పేజీ తరువాయి)

ప్రతి నెల 20ప్రాంతాలను శుభ్రం చేయాలని ఆదేశించారు. ఖమ్మంనగరంలో ప్రజలకు కనీసం జవాన్లు ఎవ్వరో తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. పారిశుద్య కార్మికుల ఆరోగ్య ప్రొఫైల్ నిర్వాహణ చేపట్టాలని సూచించారు. కేఎంసీ పరిధిలో హోర్డింగ్‌లపై ట్యాక్స్‌లు వసూళ్ల చేయటం లేదని, తాగునీటి పంపుల బిల్లులు, ఆస్తి పన్నులు, ట్రేడ్ లైసెన్స్‌ల బిల్లులు వసూళ్ల జరగటం లేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ట్రేడ్ లైసెన్స్‌లు కనీసం రెన్యూవల్స్ జరగటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ ఉల్లా, ఈఈ కృష్ణలాల్, ఏసీపీ వసుంధర, ఆర్వో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ సమావేశానికి కేఎంసీకి చెందిన పలువురు అధికారులు ఆలస్యంగా హాజరయ్యారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఉదయం 10.50 గంటలకు కేఎంసీ సమావేశానికి వచ్చి అధికారులు రాకపోవటంతో కమిషనర్ ఛాంబర్‌లోకి తిరిగి వెళ్లారు. పలు విభాగాల అధికారులు, ఉద్యోగులు ఉదయం 11.10కు సమావేశానికి చేరారు. గంటన్నరపాటు జరిగిన సమావేశం ఖమ్మం నగర పాలక సంస్థలోని లోపాలను బయటపెట్టింది.

ప్రమోషన్ పొందిన అంగన్‌వాడీ టీచర్లకు పూర్తి జీతం చెల్లించాలి: సీఐటీయూ

కొత్తగూడెం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మినిఅంగన్‌వాడీ టీచర్ల నుంచి మెయిన్ అంగన్‌వాడీ టీచర్లుగా ప్రమోషన్ పొందిన వారికి 13,650 పూర్తి జీతాన్ని చెల్లించాలని, ఖాళీగా ఉన్న టీచర్ హెల్పర్‌పోస్టులను భర్తీ చేయడానికి తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని అంగన్‌వాడీ టీచర్లు హెల్పర్లు అందరికి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటి చట్టాన్ని అమలుచేయాలని సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం. సాయిబాబు డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జరిగిన అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ సీఐటీయూ జిల్లా జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ఐసీడీఎస్‌ను ప్రైవేట్‌పరం చేయడానికి అనేక రకాల కుట్రలు చేస్తుందని అందులో భాగంగానే నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలుచేస్తుందని విమర్శించారు.సమావేశంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షురాలు సునిత, జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ పాల్గొన్నారు.

ఉన్నత విద్యే ఉత్తమ సమాజానికి దారి

- కళాశాల విద్యాజాయింట్ డైరెక్టర్ రాజేందర్‌సింగ్



కళాశాలను పరిశీలిస్తున్న జాయింట్ డైరెక్టర్ రాజేందర్

ఖమ్మంఖానాపురంహవేలి అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యే ఉత్తమ సమాజానికి దారని తెలంగాణ కళాశాల విద్యా కమిషనరేట్ జాయింట్ డైరెక్టర్ ఆర్.రాజేందర్ సింగ్ అన్నారు. గురువారం నగరంలోని ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ కళాశాలలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రతీ కళాశాల ప్రవేశాలు, మౌలిక సదుపాయాల కల్పన, వార్షిక విద్యా ప్రమాణాల తీరుతెన్నులు, సెమిస్టర్ సిలబస్, పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడి, ఉపాధి కల్పనా కోర్సుల వివరాలు, విద్యార్థుల హాజరు శాతం,తదితర అంశాలను సమీక్షించారు. జ్ఞాన తెలంగాణ, సమాజానికి, ఉన్నత మానవ వనరుని అందించడంలో ప్రభుత్వ కళాశాలల పాత్ర వెలకట్టలేనిదన్నారు. ఇటీవల అటానమస్ హోదా పొందిన కళాశాలలకు కావలసిన సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ మొహ్మద్ జాకిరుల్లా, ఖమ్మం మహిళా కళాశాల, మధిర, సత్తుపల్లి, నేలకొండపల్లి, ఇల్లందు, కొత్తగూడెం,పాల్వంచ, భద్రాచలం, మణుగూరు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులతో ప్రత్యేక సమావేశాలను నిర్వహించారు. వివిధ సమస్యలను తెలుసుకున్నారు.

ఖమ్మం మహిళా డిగ్రీ కళాశాలలో న్యాక్ బృందం తనిఖీ

ఖమ్మంఖానాపురంహవేలి అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను న్యాక్ బృందం గురువారం తనిఖీ చేసింది. ఈ విషయాలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పద్మావతి తెలిపారు. ఐదు సంవత్సరాలకి ఒకమారు సందర్శించే న్యాక్‌బృందంలో చైర్‌పర్సన్ పురుషోత్తంనాయక్, కోఆర్డినేటర్ మెంబర్ చంద్రికాలయం, జోసెఫ్ మెంబర్లు, కళాశాల విద్యా కమిషనర్ ఆఫీస్ జేడీ రాజేంద్ర సింగ్ తదితరులు అన్ని విభాగాలను పరిశీలించారు. 2018 నుంచి 2023 వరకు జరిగిన అభివృద్ధిని మౌలిక వసతులను పరిశీలించారు. సందేహాలను నివృత్తి చేశారని తెలిపారు. రెండురోజుల పర్యటనలో భాగంగా మొదటి రోజు విద్యార్థులతో తల్లిదండ్రులతో, పూర్వ విద్యార్థులతో, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కళాశాల ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ రాకేష్ శ్రీరామ న్యాక్ బృందాన్ని సమన్వయపరచగా వారు అన్ని విభాగాలను సందర్శించారు. కళాశాల వసతులపై న్యాక్ బృంద సభ్యులు సంతృప్తి వ్యక్తం చేసింది.

కొనసాగుతున్న ట్రెయినీ ఐఏఎస్, ఐపీఎస్‌ల పర్యటన

కారేపల్లిఅక్టోబరు24:(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హల్యాతండాలో మూడురోజులుగా పర్యటిస్తున్న ఐదుగురు సభ్యులతో కూడిన ట్రెయినీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల పర్యటన గురువారం హల్యాతండాతోపాటు, ఉసిరికాయలపల్లి గ్రామాల్లో కొనసాగింది. గ్రామాల్లో జరుగుతన్న ఈజీఎస్‌పనులు, చెరువులలో పూడికతీత పనులను పరిశీలించారు. పక్కనే ఉన్న ఓసీ బొగ్గు గనులను పరిశీలించారు. బొగ్గును వెలితీసే విధానంపై సింగరేణి సంస్థ అధికారులను అడిగి తెలుసుకున్నారు. శాంతినగరంలోని ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. వారితో కలసి అక్కడే భోజనంచేశారు. వారి వెంట ఎంపీడీవో సురేందర్, పంచాయతీ కార్యదర్శి నెహ్రూ ఉన్నారు.

త్వరలో గుజరాత్‌కు ఎర్రుపాలెం మహిళా రైతులు

- అమూల్ డెయిరీలో పాల మెలకువలపై అధ్యయనం
- ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- ఎర్రుపాలెంలో ఇందిరాశక్తి డెయిరీ పరిశీలన



సమాఖ్య సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఎర్రుపాలెం, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): త్వరలో ఎర్రుపాలెం మండలం నుంచి 500మంది మహిళా రైతులను గుజరాత్ పంపుతామని, అక్కడ అమూల్ డెయిరీలో పాల వ్యాపారంపై అధ్యయనం చేస్తారని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని మహిళ సమాఖ్య సభ్యులు నిర్వహిస్తున్న ఇందిరా మహిళ డైరీరి ఆయన పరిశీలించారు. సమాఖ్య మహిళ సభ్యులతో మాట్లాడారు. ఇందిర మహిళ డెయిరీ ద్వారా పాల ఉత్పత్తి వ్యాపారం కోసం ముందుకు వచ్చిన మహిళలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రతిష్టాత్మకంగా పాల ఉత్పత్తి వ్యాపారాన్ని తమ భుజస్కంధాలపై వేసుకున్న మహిళలకు అన్నివిధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఉత్తమ పశుపోషక విధానాలను అవలంభించి డెయిరీ వ్యవస్థను పటిష్టంగా, విజయవంతంగా నిర్వహించాలన్నారు. పాల వ్యాపారంలో నూతన ఒరవడులు సృష్టించాలని, ఇందుకోసం కోసం క్షేత్రస్థాయిలో వ్యాపారాన్ని నిర్వహిస్తున్న వారి సలహాలు, సూచనలు తెలుసుకోవాలని చెప్పారు. పాలవ్యాపారం ద్వారా ఎక్కువ ఆదాయాన్నిపొందేందుకు ఇందిరా డెయిరీ మంచి అవకాశమని, దానిని అందిపుచ్చుకుని విజయాన్ని సాధించాలన్నారు. ఎర్రుపాలెం మండలం నుంచి 500 మంది మహిళలను పుశుపోషణలో అనుభవం ఉన్న మహిళలను ప్రభుత్వం ఖర్చులతో గుజరాత్ రాష్ట్రం పంపుతామన్నారు. అక్కడ అమూల్ పాల వ్యాపార సంస్థ నుంచి మెళుకులు, సలహాలు ఇప్పించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఇందిర మహిళ డెయిరీ ద్వారా 5వేలలీటర్ల పాలసేకరణ నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో సన్యాసయ్య, విజయడెయిరీ మేనేజర్ సిద్దేశ్వర్, తహసీల్దార్ ఉషాశారద, ఎంపీడీవో సురేందర్, డీపీఎం శ్రీనివాస్ ఏపీఎం కె.వెంకటేశ్వర్లు, డెయిరీ ఏపీఎం లక్ష్మణరావు, ఇందిర డెయిరీ అధ్యక్షురాలు కె.అన్నపూర్ణ, ఉపాధ్యక్షురాలులలిత, రమణ, మహిళ సమాఖ్య అధ్యక్షురాలు అనిత, రమాదేవి, రమణారెడ్డి, శాంతకుమారి, లత, కృష్ణారెడ్డి, రామలక్ష్మి, తనూజ పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో శీతలీకరణ యూనిట్ పనులు చేపట్టాలి: డీఆర్‌డీఏ పీడీ

బోనకల్: పాల శీతలీకరణ యూనిట్ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని డీఆర్‌డీఏ పీడీ సన్యాసయ్య ఆదేశించారు. స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయం ఆవరణలో నిర్మిస్తున్న ఇందిరా డెయిరీ శీతలీకరణ యూనిట్ నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. సాధ్యమైనంత తొందరగా పనులను పూర్తి చేయాలని సూచించారు. శీతలీకరణ యూనిట్ నిర్మాణం చుట్టూ గ్రావెల్ తోలకాలను జరిపించాలన్నారు. అధికారులకు పలు సూచనలు చేశారు. త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పున్నం చందర్, ఎంపీడీవో ఆర్. రమాదేవి, ఏపీఎం పద్మలత పాల్గొన్నారు.

అండర్-14 రాష్ట్ర క్రికెట్ జట్టుకు భద్రాద్రి క్రీడాకారుడు



ఎంపికైన రిత్విక్

భద్రాచలం,అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ అండర్-14 రాష్ట్ర క్రికెట్ జట్టుకు భద్రాచలానికి చెందిన క్రికెటర్ నక్కా రిత్విక్ ఎంపికయ్యారు. గద్వాల్‌లో ఇటీవల జరిగిన ఎంపికల్లో నాలుగు మ్యాచ్‌ల్లో రిత్విక్ బ్యాటింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరృడంతో సెలెక్టర్లు మొదటి రౌండ్‌లోనే అతన్ని ఎంపిక చేశారు. క్రికెట్‌పై మక్కువ ఉన్న రిత్విక్ భద్రాచలంలోని బెస్ట్ క్రికెట్ అకాడమీలో తేజ ఆనంద్‌పాల్ (బుజ్జి) ఆధ్వర్యంలో తర్ఫీదు పొందుతున్నారు. చిన్ననాటి నుంచే క్రికెట్ పట్ల ఆసక్తి పెంచడంతో తల్లిదండ్రులు ఆ దిశగా ప్రోత్సహించారు. భద్రాచలంలో 8వ తరగతి చదువుతున్న రిత్విక్ అండర్-14 రాష్ట్ర జట్టులో చోటు సంపాదించడం పట్ల భద్రాద్రివాసులు హర్షాతిరేకం వ్యక్తం చేస్తున్నారు.

మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్న బీజేపీ

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- నేలకొండపల్లిలో మండల 9వ మహాసభ ఘనంగా ప్రారంభం



ర్యాలీలో పాల్గొన్న తమ్మినేని, నాగేశ్వరరావు

నేలకొండపల్లి, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మతోన్మాదాన్ని రెచ్చగొడుతోందని, హిందూరాజ్య స్థాపన పేరుతో దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని మోదీ సర్కార్ ప్రయత్నిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆరోపించారు. మండల పరిధిలోని మూటాపురంలో గురువారం సీపీఎం మండల 9వమహాసభలో ఆయన మాట్లాడారు. తొలుత గ్రామంలో పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులు భారీప్రదర్శన చేశారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పార్టీ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరితో పాటుగా మూటాపురంలో అమరులైన వారి చిత్రపటాలకు పూలు వేసి ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా పార్టీ జండాను సీనియర్ నాయకుడు ఏలూరి రంగారావు ఆవిష్కరించారు. అనంతరం చావా లెనిన్‌బాబు నగర్‌లో పార్టీ మండల మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ దేశ సంపదను అంబానీ, అదానీలాంటి కార్పొరేట్ దిగ్గజాలకు కట్టబెట్టటానికి చర్యలు తీసుకుంటున్నదన్నారు. దేశంలో మనుధర్మాన్ని తీసుకురావటానికి చర్యలు తీసుకుంటున్నదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఎం ఉద్యమాలకు సిద్ధమవుతున్నట్లు వీరభద్రం చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, పోతినేనిసుదర్శన్, బండి రమేష్, కేవీరెడ్డి, ఏలూరి రంగారావు, ఇంటూరి అశోక్, గుడవర్తి నాగేశ్వరరావు, మంకెనపల్లి నర్సింహారావు, మందడపు మురళి, కోడూరి వెంకటాచారి, సామాల మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాలు పెంచాలి

- భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్
- జిల్లా విద్యాశిక్షణ కేంద్రంలో హెచ్‌ఎంలు, ఎంఈవోలతో సమీక్ష



మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ పాటిల్

కొత్తగూడెంఅర్బన్,అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో విద్యాప్రమాణాల పెంపునకు అధికారులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్ దిశానిర్దేశం చేశారు. గురువారం జిల్లా విద్యాశిక్షణా కేంద్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, ఎంఈవోలతో సమావేశం నిర్వహించారు. నాణ్యమైన విద్యతో పాఠశాలలు అభివృద్ధి సాధ్యమని, విద్యార్థుల సంఖ్యను పెంచితే అభివృద్ధి సాధించినట్లు కాదన్నారు. విద్యార్థుల్లో గుర్తించిన నైపుణ్య సామర్థ్యాలను వారి తల్లిదండ్రులకు తెలియజేయాలని తద్వారా విద్యార్థులకు ఇష్టమైన రంగాల్లో అభ్యున్నతి సాధిస్తారని ఆకాంక్షించారు. పాఠశాల పరిశుభ్రత కార్యక్రమాలకు కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పదోతరగతి విద్యార్థుల్లో పరీక్షలపై నెలకొన్న భయాందోళనలు తొలగించాలని, బట్టిపట్టే విధానానికి స్వస్తి పలికేందుకు ప్రణాళికబద్ధంగా చదివించి పరీక్షలకు సమాయత్తం చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా 80 శాతం పాఠశాలలు సందర్శించిన ఏంఈవో దయాల్‌ను అభినందించారు. సమావేశంలో డీఈవో వెంకటేశ్వరచారీ, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ మాధవరావు, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజశేఖర్, జిల్లా సైన్స్ అధికారి చలపతిరాజు పాల్గొన్నారు.

మావోయిస్టుల పేరుతో అదివాసుల హత్యలు

- తెలంగాణ ప్రజాపాలనలోనూ ఎన్‌కౌంటర్లు సరికాదు
- రడం శ్రీను సంస్మరణ సభపై ఆంక్షలు అన్యాయం
- పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్



మాట్లాడుతున్న పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్

ఇల్లెందు, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): అపరేషన్ కగార్‌లో అమయాక అదివాసి గిరిజన ప్రజలను మావోయిస్టుల ముద్రవేస్తూ కాల్చిచంపుతున్నారని రాష్ట్ర పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ ఆరోపించారు. ప్రజాపాలన అంటూనే తెలంగాణలోనూ ఎన్‌కౌంటర్‌లు సాగిస్తున్నారని విమర్శించారు. ఇల్లెందు మండలం కొమరారం గ్రామంలో గురువారం ప్రజాఫ్రంట్ నేత, ప్రజాకళా మండలి కళాకారుడు రడం శ్రీను సంస్మరణ సభ జరిగింది.

ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మధ్య భారతదేశంలో అదివాసుల మీద బారతదేశ సైనిక బలగాలు డ్రోన్లతో దాడులు చేస్తూ అమయాక అదివాసులను చంపివేస్తూన్నారని, వారిని మవోయిస్టులుగా చూపడం కేంద్ర బలగాలకు రివాజుగా మారిందన్నారు.గోదావరి పరివాహక తెలంగాణ భూభాగంలో నిత్యం ఎన్‌కౌంటర్లు జరుగుతూ అప్రకటిత నిర్బంధానికి తెలంగాణ ప్రభుత్వం కూడా పూనుకోవడం దారుణమన్నారు. ప్రజాస్వామ్య పరిపాలన మాట మాట్లాడిన కాంగ్రెస్ ప్రభుత్వం భద్రాది కొత్తగూడెం జిల్లా కరకగూడెంలో ఆరుగురు అదివాసి బిడ్డలను నక్సలైట్ల పేరుతో ఎన్‌కౌంటర్‌ల చేయడాన్ని ఏమనుకోవావాలో చెప్పాలన్నారు.

కొమరారం గ్రామంలో తెలంగాణ ప్రజాస్వమిక విప్లవసాంస్కృతిక కళాకారుడైన రడం శ్రీను సంస్మరణ సభను తెలంగాణ ప్రజాఫ్రంట్ నిర్వహించుకుంటున్న తరుణంలో గంటలోనే పూర్తి చేయాలని చెప్పి అంక్షలు విధించడం అప్రజాస్వామిక చర్య అన్నారు. ప్రజాస్వామిక అకాంక్షల వైపు మాట్లాడే వారిపై ఉపా, తదితర కేసులు పెట్టి సంవత్సరాల తరబడి జైల్లో నిర్బంధించడమే కాకుండా, వాళ్లను అర్బన్ నక్సలైట్ల పేర్లతో ముద్రవేసి అక్రమ అరెస్టులకు పాల్పడడం శోచనీయమన్నారు. కొమరారం లాంటి విప్లవోద్యమ ప్రాంతంలో ప్రజలు క్రియాశీలంగా విప్లవోద్యమాల వైపు నిలబడి ఉండటం అభినందనీయమన్నారు.

ఈసభలో న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు అవునూరి మధు, తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా నాయకుడు చార్వాక, జిల్లా బీఆర్‌ఎస్ నాయకుడు దిండిగల రాజేందర్, తెలంగాణ ప్రజాఫ్రంట్ నాయకులు నలమాస కృష్ణ, అశోక్ కుమార్, ఎట్టి ప్రశాంత్, కుంజ రాఘవులు, జనసమితి రాష్ట్ర నాయకుడు గోపగాని శంకర్‌రావు, చిర్ర రవి, చావా రమేష్, జాన్ అమర్, శాంతక్క, వారధతుడుందెబ్బ అదివాసీ సంఘాల నాయకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎట్టకేలకు మధిరకు 'న్యాయ'ం

- రేపు సబ్ కోర్టును ప్రారంభించనున్న హైకోర్టు న్యాయమూర్తులు
- రూ.24 కోట్లతో నిర్మించనున్న భవనానికి శంకుస్థాపన



ప్రారంభోత్సవానికి ముస్తాబైన సబ్ కోర్టు భవనం

మధిర, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మధిరకు గత సంవత్సరం మంజూరైన సబ్‌కోర్టు శనివారం ప్రారంభం కానుంది. ముఖ్యఅతిధులుగా హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పి.శ్రీసుధ, జస్టిస్ భీమపాక నగేష్, జస్టిస్ కె.శరత్‌లు వస్తున్నారు. మధిర రిక్రియేషన్ క్లబ్ భవనంలో ఏర్పాటుచేసిన మధిర సీనియర్ సివిల్ జడ్జి కోర్టు కమ్ అసిస్టెంట్ సెసన్స్ జడ్జి కోర్టు (సబ్‌కోర్టు)ను ప్రారంభిస్తారు. అలాగే శిధిలమైన పాత కోర్టు భవనం స్థానంలో కొత్తగా రూ.24కోట్లతో మంజూరైన రెండు కోర్టుల నూతన భవనానికి శంఖుస్థాపన చేస్తారు.

సాకారమైన కల

మధిర మున్సిఫ్ కోర్టుకు చారిత్రాత్మకమైన ప్రాదాన్యత వుంది. ఖమ్మం జిల్లా ఏర్పడకముందు వరంగల్ జిల్లాలో అతి పెద్ద తాలూకా కేంద్రంగా మధిర ఉంది. ప్రస్తుతం నియోజకవర్గాలుగా ఏర్పడ్డ వైరా, సత్తుపల్లి, కొత్తగూడెంల్లోని కొన్ని ప్రాంతాలు మధిర తాలూకాలోనే ఉండేవి. ఆంధ్ర, తెలంగాణ సరిహద్దుగా మధిరలో కోర్టు ఏర్పాటుచేయడంతో ప్రాదాన్యత ఏర్పడింది. కాలక్రమేనా ఆయా ప్రాంతాలు కొత్త నియోజకవర్గాలుగా ఏర్పడటంతో మధిర జ్యూరిడిక్షన్ పరిధి తగ్గుతూ వచ్చింది. మధిరకోర్టు సదుపాయాల పరంగా కేసుల పరంగా సబ్‌కోర్టు కుఅర్హత ఉండటంతో గతంలోనే సబ్‌కోర్టు మంజూరికి మధిరకు అర్హత ఉంది. అయితే రాజకీయప్రాధాన్యత, పట్టింపులేని స్థానికేతర ప్రజాప్రతినిధుల వల్ల మధిరకు వచ్చే సబ్‌కోర్టు కాస్తా ప్రభుత్వంలో కీలక పదవులున్న సత్తుపల్లికి 1989లో తరలిపోయింది.

అప్పటినుంచి మూడున్నర దశాబ్దాలుగా ఈ ప్రాంత కక్షిదారులు, న్యాయవాదులు, పోలీసులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సత్తుపల్లి వెళ్లేందుకు మధిర నుంచి సరైన రవాణా సదుపాయం కూడా లేదు. రెండు బస్సులు మారాల్సివస్తుంది. స్థానిక ప్రజాప్రతినిధులు కనీసం సత్తుపల్లికి నేరుగా బస్సు సదుపాయం కూడా ఏర్పాటు చేయలేకపోయారు. పేరుకు సత్తుపల్లి సబ్ కోర్టు అయినా అక్కడ కేసుల్లో అధిక బాగం సగానికి పైగా మధిర జ్యూరిడిక్షన్‌పరిధిలోనివే. 600కేసులుంటే అందులో 400వరకు మదిరకు చెందినవే ఉంటున్నాయి. రూ.10లక్షల దాటిన కేసులన్నీ సత్తుపల్లి సబ్‌కోర్టుకు వెళ్లాల్సివస్తుండటం వ్యయప్రయాసలతో కూడినదిగా మారింది. దీంతో పరిస్థితిని ఎప్పటికప్పుడు బార్ అసోసియేషన్ జిల్లా కోర్టు , హైకోర్టు న్యాయ మూర్తుల దృష్టికి తీసుకెల్తూ వచ్చారు. పలు దఫాలుగా దర్నాలు, రిలేదీక్షలు తదితర పోరాటాలు చేశారు.

ఫలించిన పోరాటం...

దశాబ్దాలుగా న్యాయవాదులు చేస్తున్న అలుపెరగని పోరాటం ఎట్టకేలకు ఫలించింది. గత సంవత్సరం 2023 అక్టోబరు 5తేదీన అప్పటి ప్రభుత్వం మధిరకు సీనియర్ సివిల్ జడ్జికోర్టు, అసిస్టెంట్ సెసన్స్‌జడ్జి కోర్టులు మంజూరి చేస్తూ ఆదేశాలు ఇచ్చింది. మధిర రిక్రియేషన్ క్లబ్ లోని పైఅంతస్తు భవనంలో సబ్‌కోర్టు ఏర్పాటుకు అనువైనదిగా నిర్ణయించి హైకోర్టుకు ప్రతిపాదనలు పంపడటంతో హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నెల 26వతేదీన ఉదయం 9 గంటలకు హైకోర్టు న్యాయమూర్తులు ముగ్గురు ముఖ్యఅతిధిలుగా పాల్గొని సబ్‌కోర్టును ప్రారంభించనున్నారు. డిప్యూటీ సీఎం చొరవతో నూతనంగా రూ.24కోట్లతో మంజూరైన రెండు కోర్టుల రెండు అంతస్థుల భవనం, రికార్డుల రూమ్‌లకు అదేరోజు న్యాయమూర్తులు శంఖుస్థాపన చేస్తారు. ఇప్పటికే మధిరలో జూనియర్ ప్రిన్సిపుల్ సివిల్ జడ్జి కోర్టు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, ద్వితీయశ్రేణి జడ్జి కోర్టులు ఉన్నాయి. కాగా, కొత్తగా మంజూరైన సబ్‌కోర్టుకు కొత్త న్యాయమూర్తి వచ్చేంతవరకు సత్తుపల్లి న్యాయమూర్తే ఇంచార్జిగా విధులు నిర్వహించనున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

దుమ్ముగూడెం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చి నార్లగూడెం కొం గవాగు గుంపు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యు వకుడు మృతి చెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. నారాయణరావుపేటకు చెందిన పాయం జంపయ్య(21), కొమరం వీరయ్యలు కలిసి ద్విచక్రవాహనంపై భద్రాచలం వెళ్లి అక్కడి నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా, వాహనం అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న తాటిమొద్దును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో జంపయ్య అక్కడిక క్కడే మృతి చెందగా, వీరయ్యకు తీవ్రగాయాలు కాగా, 108 వాహనంలో భద్రాచలం ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడ్డ వీరయ్య పరిస్థితి ఒకింత విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

కూసుమంచిలో...

కూసుమంచి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని మల్లేపల్లి వద్ద జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని జుజ్జులరావుపేట గ్రామానికి చెందిన ఐతం అనిల్(31) కూలీ పనులు చేస్తు జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో ముదిగొండ మండలం మాదాపురం గ్రామంలో కూలీ డబ్బులు తీసుకుని బైక్‌పై తిరిగి వస్తుండగా, మార్గమధ్యలో మల్లేపల్లి గ్రామంలో ఎదురుగా రాజేశ్వరపురం వైపు వస్తున్న టిప్పరు డ్రైవరు బైక్‌ను ఢీకొట్టాడు. వెంటనే స్థానికులు 108వాహనంలో నేలకొండపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందాడు. మృతుడి మేనమామ పడిశాల మైసయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

మీనవోలు గ్రామంలో..

ఎర్రుపాలెం,అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని మీనవోలు గ్రామ శివారులో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని కంచికచర్ల గ్రామానికి చెందిన వేముల దుర్గారావు(40) మధిర నుంచి కంచికర్ల వెళ్తూ పెట్రోల్ బంకు సమీపంలో ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో కిందపడిపోయాడు. తీవ్రంగా అతడిని స్థానికులు 108 సహాయంతో మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడు కంచికచర్లలో మటన దుకాణం నిర్వహిస్తున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడున్నారు. ప్రమాద ఘటన జరిగినప్పుడు మృతుడి వద్ద రూ.56,800లు నగదు ఉందని 108 సిబ్బంది తన బంధు వులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.మృతుడి తండ్రి వీరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాబాయిని హత్య చేసిన వ్యక్తి అరెస్టు

- వివరాలు వెల్లడించిన సీఐ ఇంద్రసేనారెడ్డి

జూలూరుపాడు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): చేతబడి చేస్తున్నాడనే అనుమానంతో సొంత బాబాయిని హత్య చేసిన కుమారుడితో పాటు మరో వ్యక్తిని అరెస్టు చేసినట్లు జూలూరుపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను వెల్లడించారు.

రాచబండ్లకోయగూడెం గ్రామానికి చెందిన కుంజా ప్రవీణ్ అదే గ్రామానికి చెందిన మ ల్కం గంగయ్యతో కలసి హత్య చేసినట్లు తెలిపారు. బాబాయి భిక్షం గ్రామస్థులకు, తన తల్లికి చేతబడి చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నాడనే అనుమానంతో ప్రవీణ్ తన సొంత బా బాయిని హత్య చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేసుకున్నాడు. అతడిని హతమార్చేందుకు గంగయ్య సహకారం తీసుకున్నాడు. ఈ నెల 21వ తేదీన ఇద్దరులు కలసి మద్యం తాగుదామని చెప్పి భిక్షంను గ్రామ సమీపంలోని వేపలవాగు వద్దకు తీసుకువెళ్లారు. ముగ్గురు కలసి మద్యం సేవించారు. ఈ క్రమంలో ప్రవీణ్ నా తల్లికి నువ్వు చేతబడి చేయడంతోనే అనారోగ్యంతో ఇబ్బంది పడుతుందని, ఎన్ని ఆసుపత్రులకు తీసుకువెళ్లిన ఎలాంటి రోగం లేదని వై ద్యులు చెబుతున్నారని, గ్రామస్థులకు చేతబడి చేస్తున్నావని, నీవు ఎంతమందిని ఇబ్బంది పె డతావంటూ బాబాయి భిక్షాన్ని ప్రశ్నించాడు. ఈ క్రమంలో ప్రవీణ్, గంగయ్యలు కలసి అత డిని రాయితో విచక్షణ రహితంగా మోదారు. కొనఊపిరితో ఉన్న అతడిని సమీపంలోని వాగులో పడవేసి హత్య చేశారు. కాగా వారు ముగ్గురు ఇంటి వద్ద నుంచి కలిసి వెళ్లేది భిక్షం మరో సోదరుడి కుమారుడు నరేంద్ర కుమార్ చూశాడు. కాగా బాబాయి భిక్షం రాత్రి అయినా ఇంటికి తిరిగి రాకపోడంతో ఫోన్ చేశాడు. ఫోన్ ఎత్తకు పోవడంతో, తిరిగి గంగయ్యకు ఫోన్ చేశాడు. గంగయ్య ఫోన్ ఎత్తి ముగ్గురం కలసి వేపలవాగు వద్ద మద్యం తాగుతున్నామని, నువ్వు కూడా రావాలని అతడికి చెప్పాడు. దీం తో నరేంద్ర కుమార్ అక్కడకి వచ్చాడు. ఆయనకు బాబాయి భిక్షం కనిపించలేదు. బాబాయి ఎక్కడికి వెళ్లాడని వారిని అడిగాడు. గ్రామస్థులకి, తన తల్లికి చేతబడి చేశాడనే అనుమానంతో బాబాయిని ఇద్దరం కలసి హత్యచేసినట్లు ప్రవీణ్ తన సోదరుడు నరేంద్రకుమార్‌కు తెలిపాడు. దీంతో అతడు వెంటనే గ్రామానికి చేరుకుని విషయాన్ని బంధువులకు తెలియజేసి పోలీసులకు సమాచారాన్ని అందించాడు. హత్యకు పాల్పడిన రోజు నుంచి నిందితులిద్దరు తప్పించుకుని తిరుగుతున్నారు. దీంతో వారిద్దరిని బేతాళపాడులో పట్టుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సై బి.రాణాప్రతాప్ పాల్గొన్నారు.

తాటిచెట్టుపై నుంచి పడి వ్యక్తి దుర్మరణం



బాబురావు

అశ్వారావుపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో తాటి చెట్టుపై నుంచి పడి గౌడ సంఘం అధ్యక్షుడు మృతి చెందిన సంఘటన అశ్వారావుపేటలో జరిగింది. పట్టణానికి చెందిన గౌడ సంఘం అధ్యక్షుడు ఆరేపల్లి బాబురావు(40) గురువారం ఉదయం పాపిడిగూడెం రోడ్డులో తాటిచెట్టు కల్లు తీసేందుకు చెట్టు ఎక్కి. కల్లు తీసిన అనంతరం ఛాతిలో నొప్పి రావడంతో కిందకు దిగుతూ పడిపోయాడు.

వెంటనే సమీపంలోని వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబసభ్యులు స్థానిక ఆసుపత్రికి తరలించారు. అతడిని పరిక్షించిన వైద్యులు అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు వివరాలు సేకరించారు.

రేపల్లెవాడలో చిరుత కలకలం



చిరుతపులి పాదముద్రలను సేకరిస్తున్న అటవీ అధికారులు

ఏన్కూరు అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): ఏన్కూరు మండలం రేపల్లేవాడ గ్రామంలో చిరుతపులి సంచారం కలకలం సృష్టించింది. గ్రామశివారు మిరపతోటలో పులి సంచారంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. మైదానప్రాంతంలోకి తొలిసారి పులి రావడంతో రేపల్లేవాడ, నాచారం, మేడేపల్లి, హిమాంనగర్, రాజులపాలెం, రామతండా, ఒంటిగుడిసె, బద్రుతండా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పొలాలకు వెళ్లడానికి రైతులు భయపడుతున్నారు. కనకగిరి అడవులనుండి వచ్చినట్లు అనుమానిస్తున్నారు. గురువారం విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు డీఆర్వో శ్రీనివాస్, బీట్ అధికారుల డి.శ్రీను, చందర్, పులిసంచరించిన మిరప తోట ప్రదేశాలను పరిశీలించారు. పాదముద్రలను, వెంట్రుకలను, పెంటను పరీక్షించి చిరుత ఆనవాళ్లు ఉన్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు ప్రచారం చేస్తున్నారు. ఒంటరిగా పొలాలకు వెళ్లవద్దని హెచ్చరిస్తున్నారు. అడవులకు వెళ్లేటప్పుడు గుంపులు, గుంపులుగా శబ్దం చేస్తూ వెళ్లాలని సూచించారు. అటవీ జంతువులకు హాని కలిగించే వలలు, ఉచ్చులు, కరెంట్ తీగలు ఏర్పాటుచేసే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మెకానిక్ కుటుంబానికి ఆర్థికసాయం

ఖమ్మంచర్చికాంపౌండ్, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మెకానిక్ నాగేశ్వరరావు కుటుంబానికి ఖమ్మం టూవీలర్స్ యూనియన్, ఏపీ టూవీలర్స్ యూనియన్ మెకానిక్‌లు ఆయన కుటుంబానికి రూ.20వేలు అందించారు. ఖమ్మం నగరంలోని సంఘం కార్యాలయంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వంగాల కొండలరావు, మృతుని భార్య ఉషకు నగదు అందించారు. మెకానిక్‌లకు ఏ ఆపద వచ్చినా యూనియన్ ఆధ్వర్యంలో ఆర్థికంగా సహాయం అందిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో లింగనబోయిన మురళి, పులుసు శ్రీను, అన్నదేవరభద్రం, పావురాల విజ్ఞానప్రసాద్, దేవరకొండ నాగబాబు పాల్గొన్నారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

కూరగాయలు ధరలు
(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	48రూ.
వంకాయ	56
గుత్తి వంకాయ	60
బీరకాయ	54
పచ్చిమిర్చి	54
కాకరకాయ	54
బెండకాయ	58
పొట్లకాయ	60
దోసకాయ	54-56
గోరుచిక్కుడు	80
క్యాబేజీ	34
దొండ	40-48
సొరకాయ	36
క్యారెట్	48
క్యాప్సికం	80
ఆలుగడ్డ	40
ఉల్లిగడ్డ	55-60
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	160
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

CINEMA సినిమా

నగరంలో చిత్రాలు..

వినోద:	జనక అయితే గనక..
శ్రీనివాస:	వెట్టయాన్
సాయిరాం:	విశ్వం
కేపీఎస్:	రాధేశ్యాం
తిరుమల:	దేవర

హలో ఆర్టీసీ

ఖమ్మం కొత్త బస్టాండ్

డిపో మేనేజర్ల నెంబర్లు:	9959225958
బస్టాండ్ ఎంక్వయిరీ:	9959225979
కార్గోసేవల నెంబరు:	9154298589

ఖమ్మం పాతబస్టాండ్

డిపో మేనేజర్ల నెంబర్లు:	9959225958
బస్టాండ్ ఎంక్వయిరీ:	9959225965
కార్గోసేవల నెంబరు:	9704345599

సత్తుపల్లి బస్టాండ్

డిపో మేనేజర్ల నెంబర్లు:	9959225962
బస్టాండ్ ఎంక్వయిరీ:	9959225990
కార్గోసేవల నెంబరు:	9154298595

మధిర బస్టాండ్

డిపో మేనేజర్ల నెంబర్లు:	9959225961
బస్టాండ్ ఎంక్వయిరీ:	7382925289
కార్గోసేవల నెంబరు:	8143765370

కలెక్టర్‌గారూ పెండింగ్ బిల్లులు ఇప్పించరూ..

- ముజమ్మిల్‌ఖాన్‌కు కేఎంసీ కాంట్రాక్టర్లు విన్నపం
- పెండింగ్ బిల్లులు ఇవ్వమంటూ ఫైల్ విసిరేస్తున్నారని ఫిర్యాదు



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంట్రాక్టర్లు

ఖమ్మంసంక్షేమవిభాగం,అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల నుంచి మున్నేరు వరదల వరకు ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు పెండింగ్ బిల్లులు చెల్లించాలని కేఎంసీ కాంట్రాక్టర్లు అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు మొర పెట్టుకున్నారు. గురువారం కేఎంసీకి వచ్చిన కలెక్టర్‌కు కాంట్రాక్టర్లు వినతిపత్రం అందించారు. ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి జనరల్ ఫండ్ నిధులతో చేసిన అభివృద్ధి కార్యక్రమాలకు డబ్బులు ఇవ్వలేదని మొత్తం రూ.60 కోట్లకు పెండింగ్ బకాయిలు చేరాయని అసోసియేషన్ అధ్యక్షుడు పసుపులేటి వెంకటేశ్వరరావు, కోశాధికారి జుగల్ కిషోర్, కార్యదర్శి తమ్మిశెట్టి వెంకటనారాయణ, బండి సతీష్, శ్రీహరిరాజు, శ్రీధర్, పీ కృష్ణ, మర్రి రమేశ్ విన్నవించారు. దీంతో స్పందించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి నిధులు వచ్చిన వెంటనే విడుదల చేస్తామని వారికి హామీ ఇచ్చారు.

మానవతా దృక్పథంతో చెక్కు అందించిన కలెక్టర్

ఖమ్మంఖానాపురంహవేలి: మనవాతా దృక్పథంతో సొంత ఊరు వెళ్తున్న దాసరి రమాదేవికి కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ గురువారం పదివేల చెక్కును అందించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా చిన్నగంజాం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పొంగులూరు గ్రామానికి చెందిన దాసరి రమాదేవి అనే మహిళ జూలై 2022లో కొణిజర్ల మండలం పెద్దగోపతిలో మతిస్థిమితం కోల్పోయి తిరుగుతుండగా స్థానికులు అన్నంఫౌండేషన్‌లో చేర్పించారు. వైద్యసేవల అనంతరం ఆమె కోలుకున్నారు. కుటుంబసభ్యుల వివరాలు వెల్లడించారు. దీంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వటంతో గురువారం మున్సిపల్ కమిషనర్ ఆఫీస్‌కిరాగా కలెక్టర్ సమక్షంలో కుటుంబ సభ్యులకి ఆమెను అప్పగించారు.

ట్రెయినీ కలెక్టర్ల పర్యటన

తిరుమలాయపాలెం, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ ప్రాంతాల్లో గిరిజన ప్రజల జీవన విధానంపై అధ్యయనం చేసేందుకు ఐఏఎస్, ఐపీఎస్ బృందం సభ్యులు మండలంలో గురువారం పర్యటించారు. సుబ్లేడులో రూపేష్‌జాల్వాల్, తరుణయ్‌పండే, సుమిత్ గోవిందబాయి మక్కానా, అభిషేక్‌అందాస్, ఉషా యాదవ్, సామత్ మిలన్ మహిదోయి తదితరులు పర్యటించారు. గ్రామంలో సమస్యలు తెలుసుకున్నారు అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకలపై వారు ఆరాతీశారు. అనంతరం పీహెచ్‌సీని సందర్శించారు రోగులకు అందుతున్న సేవలు అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ పీవీ రామకృష్ణ, ఎంపీడీవో సిలార్, డీటీ నరసింహారావు, ఏవో సీతారాంరెడ్డి, వైద్యురాలు వసుంధర, ఏపీవో నర్సింహారావు , ఎంపీవో సూర్యనారాయణ, పాల్గొన్నారు.

పటేల్ స్టేడియం చుట్టూ షాపింగ్ కాంప్లెక్స్



కొలతలు తీసుకుంటున్న పంచాయతీరాజ్ సిబ్బంది

ఖమ్మంస్పోర్ట్స్, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఖాళీగా ఉన్న ప్రదేశంలో షాపింగ్ కాంపెక్స్‌ల నిర్మిణానికి అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. ఈమేరకు గురువారం పంచాయతీరాజ్ సిబ్బంది ఖాళీ ప్రదేశ నార్ధారణకు కొలతలు తీసుకున్నారు. స్టేడియం చుట్టూ ప్రహరీ గోడ వైపు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తే స్టేడియానికి అద్దెల రూపంలో మరింత ఆదాయం సమకూరుతుందని గత దశాబ్ద కాలంగా ప్రతిపాదనలు ఉన్నాయి. అవి ఇంతవరకు రూపాంతరం చెందలేదు. స్టేడియం చుట్టూ రోడ్డుపైనే వీధి వ్యాపారులు పాగా వేసి రోడ్డు సైడు భారీగా వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నారని దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ఈ విషయన్ని కొంత మంది కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ దృష్టికి తీసుకెళ్లారు. షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తే ట్రాఫిక్ కష్టాలు తీరడంతో పాటు స్టేడియానికి ఆదాయం సమకూరుతుందని ప్రతిపాదించడంతో కాంప్లెక్స్‌ల నిర్మాణానికి కలెక్టర్ అంగీకరించారని తెలిసింది. తొలివిడతలో భాగంగా ఇల్లందు రోడ్డు వైపు కాంప్లెక్స్‌లు నిర్మించడానికి నిర్ణయించి ఎన్ని గదులు వస్తాయో తెలుసుకోమని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించగా, గదుల కొలతల పనిలో నిమగ్నమయ్యారు. కొలతల ప్రక్రియలో పంచాయత్‌రాజ్ సిబ్బంది, స్టేడియం కోచ్‌లు ఉన్నారు.

నకిలీ పురుగుల మందులు, ఎరువులు అమ్మితే చర్యలు: ఏడీఏ

తిరుమలాయపాలెం,అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): నకిలీ పురుగుల మందులు, ఎరువులు అమ్మితే చర్యలు తీసుకుంటామని కూసుమంచి ఏడీఏ సరిత హెచ్చరించారు. గురువారం మండలంలోని పిండిప్రోలు, తిరుమలాయపాలెం, దమ్మాయిగూడెం గ్రామాల్లో ఎరువులు, పురుగుమందుల దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్ వివరాలను తనిఖీచేశారు. ప్రభుత్వం నిర్ధేశించిన ధరలకే ఎరువుల, విత్తనాలు అమ్మాలన్నారు. ఈకార్యక్రమంలో ఏవోసీ తారాంరెడ్డి, ఏఈవోప్రదీప్ పాల్గొన్నారు.

అధిక సాంద్రత పత్తితో అధిక దిగుబడి

రఘునాథపాలెం: అధిక సాంద్రతలో పత్తిని సాగు చేయటం ద్వారా ఏకరాకు 12 క్వింటాళ్ల అధిక దిగుబడి సాగులోకి వస్తుందని, అలాగే డిసెంబరులోగా పత్తి తీయటం పూర్తి కావటంతో చీడ, పీడలు, గులాబీ రంగు పురుగు ఉధృతి నుంచి నివారణ జరుగుతుందని ఖమ్మం ఏడీఏ కొంగర వెంకటేశ్వరరావు రైతులకు అవగాహన కల్పించారు. కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం గణేశ్వరంలో వ్యవసాయక్షేత్ర సందర్శన కార్యక్రమం చేపట్టారు. రైతులకు నేరుగా ఏడీఏ అవగాహన కల్పించారు. ప్రైవేట్ కంపెనీలతో మొక్కజొన్న సాగు సమయంలోనే సరైన అగ్రిమెంట్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వైరా కేవీకే శాస్త్రవేత్త రవికుమార్, నాగపూర్ విత్తన పరిశోధన శాస్త్రవేత్త సంపత్, ఎంఏవో ఉమా మహేశ్వరరెడ్డి, కేవీకే సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటిభోజనం మరిపించేలా ఆహారాన్ని అందించాలి

- పాల్గొన్న ఎస్సీ, బీసీ డిప్యూటీ డైరెక్టర్లు కస్తాల, జ్యోతి



మాట్లాడుతున్న ఎస్సీ డీడీ కస్తాల, పక్కన బీసీ డీడీ జ్యోతి

ఖమ్మం సంక్షేమ విభాగం,అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో విద్యాభ్యాసం చేసే విద్యార్థులు వారి ఇంటి భోజనాలను మరిపించేలా సంక్షేమ భోజనాలు ఏర్పాటు చేయాలని సాంఘీక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ, బీసీ డిప్యూటీ డైరెక్టర్ గుడికందుల జ్యోతి పేర్కొన్నారు. గురువారం ఖమ్మంలోని ఎస్సీ బాలుర(బీ) వసతిగృహంలో ఎస్సీ, బీసీ సంక్షేమ వసతిగృహాల వంటశాలల ఉద్యోగులకు శిక్షణ నిర్వహించారు. విద్యార్థులకు రుచి,శుచి కలిగిన భోజనాలను వడ్డించాలని ఇందుకోసం వంట ఉద్యోగులు శ్రద్ధతో వంటలు చేయాలని సూచించారు. బీసీ డీడీ జ్యోతి మాట్లాడుతూ వంట శిక్షణలో నేర్చుకున్న విధానాన్ని వసతిగృహాల్లో వంటల సమయంలో అమలు చేయాలన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

ఖమ్మంక్రైంఅక్టోబరు24(ఆంధజ్యోతి):ఓ యువకుడిపై ఖమ్మం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం రాత్రి పోక్సో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరం శివారులోని ఓ మండల కేంద్రానికి చెందిన 14 ఏళ్ల బాలిక నగరంలోని ఓ పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది.అదేమండలానికి చెందిన 25 ఏళ్ల యువకుడు పాఠశాలలో దింపుతానంటూ మాయమాటలు చెప్పి బాలికను లొంగదీసుకున్నాడు. ఈ నేపథ్యంలో పలుమార్లు ఆమెపై లైంగిక దాడి కూడా చేశాడు. ఈ విషయం సదరు బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో వారు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేశారు.

నార్కోటిక్ పోలీసుల తనిఖీలు

ఖమ్మంక్రైంఅక్టోబరు24(ఆంధ్రజ్యోతి): నార్కోటిక్ విభాగానికి సంబంధించిన పోలీసులు గురువారం రాత్రి ఖమ్మం నగరంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. నగరంలోని ఇల్లందు క్రాస్‌రోడ్ సమీపంలో పలు కార్లను ఆపి వాహనాలను తనిఖీలు నిర్వహించి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా డ్రగ్స్ తరలింపు జరుగుతున్నట్లు సమాచారం రావడంతో ఈ తనిఖీలు నిర్వహించినట్లు తెలిసింది. కానీ ఈ తనిఖీలలో ఎలాంటి మత్తు పదార్థాలు పట్టుబడలేదని సంబంధిత పోలీసు అధికారులు తెలిపారు.

మృతుడి కుటుంబానికి పదివేల ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న కార్పొరేటర్ పాలేపు విజయ వెంకటరమణ

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): ఖమ్మం 44వ డివిజన్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అమర్లపూడి యాకూబ్(75) అనారోగ్యంతో గురువారం కన్నుమూశారు.బాధిత కుటుంబాన్ని స్థానిక కార్పొరేటర్ పాలేపు విజయ వెంకటరమణ పరామర్శించారు. రూ.10 వేలు అందించారు.యాకూబ్ భౌతికకాయం వద్ద నివాళులు అర్పించారు. డివిజన్‌లోని కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి సీపీఎం మండల కార్యదర్శిగా కేవీరెడ్డి

నేలకొండపల్లి,అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లి మండల సీపీఎం కార్యదర్శిగా కొప్పుల వెంకట్రామిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం మండల పరిధిలోని మూటాపురంలో జరిగిన మండల 9వ మహాసభలో ఈఎన్నికజరిగింది. ఆయన ఎన్నిక వరుసగా రెండోసారి.. ఆయనతో పాటు మరో 23 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.



కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, పాలేరు ఇన్‌ఛార్జి బండి రమేష్, ఏలూరి రంగారావు, గుడవర్తి నాగేశ్వరరావు, షేక్.బషీరుద్దీన్, రచ్చా నర్సింహారావు, రాసాల కనకయ్య, కట్టెకోల వెంకన్న, మూర్తి కొండలరావు, యడ్ల తిరుపారావు, పెద్దిరాజు నర్సయ్య, ఇంటూరి రాధిక, మందుల స్రవంతి పాల్గొన్నారు.

పెంట్యాల పుల్లయ్య అరెస్ట్ అక్రమం

ఖమ్మంటౌన్,అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ చింతకాని మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య అరెస్ట్ అక్రమమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈఅరెస్టును బీఆర్ఎస్ జిల్లాకమిటీ తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు.అయ్యప్పస్వామి దీక్షలో ఉన్న పుల్లయ్య ఇంటిపై దాడిచేయటం హేయమైన చర్య అని పేర్కొన్నారు. అరెస్ట్ సందర్భంగా మహిళలపై పోలీసులు అనుచితంగా ప్రవర్తించారని, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను భయభ్రాంతులను చేయటమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. ప్రజలు, పార్టీ శ్రేణుల మద్దతుతో ఇటువంటి సంఘటనలను తిప్పికొడతామని పేర్కొన్నారు. పుల్లయ్యను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మత్స్యకారుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- భద్రాద్రి జిల్లాలో రూ.1.75కోట్ల చేప పిల్లల పంపిణీ
- ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య



పాతలింగాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

కామేపల్లి,అక్టోబరు2(ఆంధ్రజ్యోతి):మత్స్యకార కుటుంబాల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. గురువారం మడల పరిధిలోని పాతలింగాలలో మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శివప్రసాద్, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు మామిడి వెంకటేశ్వర్లులతో కలిసి చెరువులో చేప పిల్లల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 876 చెరువుల్లో కోటి75లక్షల చేప పిల్లలను పంపిణి చేస్తున్నట్లు తెలిపారు. బొచ్చె, రవ్వ, బంగారుతీగ, పులస రకాల చేప పిల్లలను పంపిణీ చేస్తున్నామన్నారు. కామేపల్లిలో 6పెద్ద చెరువులకు 3.84లక్షల పెద్దపిల్లలను, 55చిన్నచెరువులకు 4లక్షల53వేల చిన్న చేప పిల్లలను పంపిణీ చేశామన్నారు. అనంతరం కామేపల్లి, కెప్టెన్‌బంజర, కొండాయిగూడెం చెరువుల్లో చేపపిల్లల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్, ఫిషరి ఫీల్డ్ ఆఫీసర్ సరిత, కాంగ్రెస్ నాయకులు గింజల నర్సింహరెడ్డి, దమ్మలపాటి సత్యనారాయణ, రాంరెడ్డి జగన్నాథరెడ్డి, నల్లమోతు లక్ష్మయ్య, రాంబాబు, గబ్రూ సొసైటీ చైర్మన్లు దొప్ప రమేష్, మధ్యాన్నపు రమేష్, రాఘవులు, లాలు, రాందాస్, కొర్ర రాములు, హర్య, మేకల మల్లికార్జున్‌రావు, నాగేంద్రబాబు, చల్ల మల్లయ్య పాల్గొన్నారు.

కానిస్టేబుళ్ల ఆత్మీయ కలయిక



ఖమ్మంక్రైం,అక్టోబరు24(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి ఖమ్మంజిల్లాలో ఎంపికైన 1984 బ్యాచ్ కానిస్టేబుళ్లు నగరంలోని ప్రైవేటు హోటల్‌లో గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ప్రస్తుతం వివిధప్రాంతాల్లో నివసిస్తున్న వీరు నాలుగుదశాబ్దాల తర్వాత ఆత్మీయంగా కలుసుకున్నారు. అప్పట్లో 105 మంది సివిల్ కానిస్టేబుళ్ల ఎంపికకాగా ప్రస్తుతం 41 మంది సర్వీసులో ఉన్నారు. 39 మంది ఉద్యోగ విరమణ పొందగా మరో 25 మంది మృతి చెందారు. ఈ కార్యక్రమానికి చనిపోయని వారి కుటుంబాలను సైతం ఆహ్వానించి వారిని శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మోహన్‌రావు, రామచంద్రరావు, రాయప్ప, శ్రీశైలం, రహీం, శ్రీనివాసులు, సత్యనారాయణ, పాల్గొన్నారు.

కానిస్టేబుల్ రాజుకు సీపీ అభినందన



ఖమ్మంక్రైం, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): అక్టోబరు 20న ఢిల్లీలో జరిగిన వేదాంత హాఫ్ మారథాన్ రన్‌లో పతకం సాధించిన కానిస్టేబుల్ పిల్లి రాజును సీపీ సునిల్‌దత్ తన కార్యాలయంలో గురువారం అభినందించారు. మొత్తం 36వేల మంది ఈరన్‌లో పాల్గొనగా రాజు 1.53నిమిషాలలో పూర్తి చేశాడు. ఆగస్టు 28న ఎన్ఎండీసీ మారథాన్ హైదరాబాదు రన్‌లో 4.42 నిమిషాలలో పూర్తి చేసి, పతకంసాధించాడు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి మంచిపేరు తేవాలని సీపీ అభినందించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఏసీపీ రమణమూర్తి, ఆర్ఐ కామరాజు పాల్గొన్నారు.

గడువులోగా సభ్యత్వ లక్ష్యాన్ని చేరుకోవాలి

బీజేపీ జిల్లా సభ్యత్వ ఇన్‌చార్జి బైరెడ్డి



కార్యకర్తలతో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

నేలకొండపల్లి, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): గడువులోగా సభ్యత్వ లక్ష్యాన్ని చేరుకోవాలని బీజేపీ జిల్లా సభ్యత్వ ఇన్‌ఛార్జి బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని కొత్తకొత్తూరులో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో బైరెడ్డి పాల్గొన్నారు. ఇప్పటికే జిల్లాలో పార్టీ సభ్యత్వం అనుకున్న దాని కంటే చాలా ఎక్కువగా జరిగిందన్నారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మన్నె కృష్ణారావు, నియోజకవర్గ కన్వీనర్ మేకా సంతోష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు షేక్.షర్ఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి డిగ్రీ కళాశాల తనిఖీ

నేలకొండపల్లి,అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): కళాశాల విద్య జేడీ రాజేందర్‌సింగ్ గురువారం మధ్యాహ్నం నేలకొండపల్లి ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలను సందర్శించారు. హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళుతూ నేలకొండపల్లి డిగ్రీ కళాశాలకు వచ్చారు. తొలుత బౌద్ధస్థూపాన్ని సందర్శించారు. అనంతరం, భక్తరామదాస ధ్యాన మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డిగ్రీ కళాశాలకు వెళ్లారు. కళాశాలలో విద్యార్థులతో మాట్లాడారు. కళాశాలలో మొక్కను నాటారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పరంజ్యోతి, లెక్చరర్లు ఉన్నారు.

పీహెచ్‌డీ సాధించిన అమ్మపాలెం వాసి



కొణిజర్ల,అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అమ్మపాలెం గ్రామానికి చెందిన గుగులోతు రాజు కుమారుడు గుగులోతు వెంకన్న జేఎన్‌టీయు అనంతపూర్ యూనివర్శిటిలో కంప్యూటర్ సైన్స్ డిపార్డ్‌మెంట్ డేటా మైనింగ్‌లో ప్రొఫేసర్ డాక్టర్ కేఎఫ్ భారతి పర్యవేక్షణలో టెక్స్ డాక్యుమెంట్ క్లస్టరింగ్ యూసింగ్ సెంట్రయిడ్ అండ్ నైబర్‌హుడ్ అప్రోచెస్ అనే అంశంపై సమర్పించిన పరిశోధన గ్రంధానికి గాను యూనివర్శిటీ నుంచి పీహెచ్‌డీ పట్టాను అందించారు. పీహెచ్‌డీ సాధించినందుకు గాను పలువురు వెంకన్నకు అభినందనలు తెలిపారు.

ఉపాధ్యాయుల ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలి: ఆర్డీవో

కల్లూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తహసిల్దార్ల పరిధిలో సిద్ధం చేసిన ఉపాధ్యాయ ఓటర్ల జాబితాలను తయారు చేసి ఈఆర్వోకు పంపాలని ఆర్డీవో రాజేంద్రగౌడ్ సూచించారు. కల్లూరు డివిజన్ కార్యాలయం లో గురువారం రెవెన్యూ కార్యక్రమాల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరిచుకొని డివిజన్ పరిధిలో గలఆరు మండలాల్లో ఉపాధ్యాయ ఓటర్ల నమో దు, దరఖాస్తుల పరిశీలిన కార్యక్రమాన్ని త్వరత గతిన నిర్వహించి వాటిపై విచారణ జరపాలని వారికి సూచించారు. ఎంపీడీవోలు, ఎంఈఓలకు అందిన దరఖాస్తులు పరిశీలన జరిపి తహసిల్దార్లకు అందిజేయాలన్నారు. కల్యాణలక్ష్మి, షాదీము బారక్ దరఖాస్తుల పరిశీలిన ను త్వరతగతిన పూర్తి చేయాలన్నారు. అదే విధంగా ధరణికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కూడా పరిష్కారించాలని తహసీల్దార్లను కోరారు. ఈ సమావేశంలో సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ, ఏన్కూరు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు పాల్గొన్నారు.

కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

» ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు వెంకన్న



మాట్లాడుతున్న టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు వెంకన్న

సత్తుపల్లిరూరల్, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): హమాలీ కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు పెంచి, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు ఏ.వెంకన్న ప్రభుత్వాలను డిమాం డ్ చేశారు. గురువారం సత్తుపల్లి పట్టణంలోని నీలం రామచంద్రయ్య భవనంలో జరిగి న సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరంతరం కష్టపడి చేస్తున్నవారి శ్రమకు తగిన ఫలితం అందడం లేదని పేర్కొన్నారు. ప్రమాదవశాత్తూ చనిపోయిన వారికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం కూడా లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అమర్లపూడి శరత్, వై.సత్తిబాబు, ధరావత్ శ్రీనివాస్, బట్ట వెంకన్న, సాంబయ్య, ధరావత్ వెంకటేశ్వరరావు, మారేశ్వరరావు, సీహెచ్.రాధాకృష్ణ, శ్రీనివాసరావు, ఆర్.సత్యనారాయణ, చింతా కృష్ణ, వాసం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి గిరిజన సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

» గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం

కొణిజర్ల, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): ఖ మ్మంలో నవంబరు 5న నిర్వహించే గిరిజన సంఘం రాష్ట్ర స్థాయి సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన క్యాదర్శి భూక్యా వీరభద్రం పిలుపునిచ్చారు. గురువారం మండలంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొణిజర్లలో జరిగిన సమావేశంలో ఆ యన మాట్లాడుతూ పోడుభూముల సమస్య పరిష్కారానికి ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. ప్రతి తండా అభివృద్ధికి కోటి రూపా యలు చొప్పున నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంఘం సహాయ కార్యదర్శి శ్రీనివాస్‌నాయక్, మండల అధ్యక్ష, కార్యదర్శులు తేజావత్ కృష్ణకాంత్, బానోతు హరిచంద్, మోహన్‌నాయక్, సీతరాములు, నరసింహరావు, శ్రీను, బాలాజీ, రాందాస్, రాములు తదితరులు పాల్గొన్నారు.

'కొనుగోలు కేంద్రాన్ని పకడ్బందీగా నిర్వహించాలి'

బోనకల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సమర్ధవంతంగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి విజయభాస్కరరెడ్డి సూచించారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో గురువారం కొనుగోలు కేంద్రాల నిర్వహణ పై అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో 11 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా ప్రస్తుతం బోనకల్‌లో ప్రారంభించామని తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ పున్నం చందర్, ఎంపీడీవో ఆర్. రమాదేవి, ఎంపీవో శాస్త్రి, ఏపీఎం పద్మలత తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మంచినీటి సహాయకుల శిక్షణ

కల్లూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముచ్చవరం గ్రామంలోని రైతువేదికలో నాలుగు రోజుల పాటుగా జరిగిన గ్రామ సహాయకుల శిక్షణ శిబిరం గురువారం నాటితో ముగిసింది. మంచినిటి పథకాల నిర్వహణలో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా గ్రామ సహాయకులు ముందస్తు జగ్రత్తలు తీసుకునేలా ఈ శిబిరంలో వారికి అవగహన కల్పించారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకొన్న గ్రామ సహయకులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ జయలక్ష్మి, జేఈ రమేష్‌లు పాల్గొన్నారు.

కారేపల్లి: మండల పరిధిలోని అప్పాయిగూడెం లోని రైతువేదికలో నాలుగు రోజులుగా నిర్వహించిన మంచినీటి సహాయకుల శిక్షణ శిబిరం గురువారంతో ముగిసింది. ఈసందర్భంగా మండల పరిధిలోని 41గ్రామపంచాయతీలలో మంచినీటి సరఫరాలో ఉత్తమసేవలు అందించిన పంపుఅపరేటర్లకు జిల్లా అధికారుల చేతల మీదుగా ప్రశంసపత్రాలు అందించారు. ఈసందర్భంగా ఆర్‌డబ్ల్యూస్ జిల్లా ఈఈ వాణిశ్రీ, డీఈ నర్సింహారావు, ఎంపీడీవో సురేందర్, సూపరింటెండెంట్ రమేష్, ఏఈలు నరేందర్‌రావు, గ్రిడ్ ఏఈ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి'

సత్తుపల్లిరూరల్, అక్టోబర్24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్లు, ఇళ్లస్థలాలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం టీకేఎంయూ వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎన్టీఆర్ నగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో రాజీవ్‌నగర్ కాలనీలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ఆర్ ఇచ్చినట్లుగానే ఇప్పటి సీఎం రేవంత్‌రెడ్డి నిరుపేదలందరికీ ఇళ్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పాలకుర్తి వీరయ్య, ఎస్‌కే.రంజాన్‌బీ, ఎస్‌కే.హమీద్, బీ.అజయ్, రమేష్, పర్సా శ్రీను, సత్యవతి, తహరా, నాగమణి, మహేశ్వరి, చెన్నమ్మ, రాంబాబు, సత్యనారాయణ, లక్ష్మీ, రాము, రమణ, వెంకటేశ్వరరావు, సతీష్, పుష్పావతి తదితరులు పాల్గొన్నారు.

వేంసూర్‌లో ఈజీఎస్ ప్రజావేదిక



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

వేంసూరు, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 15వ వార్షిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ఉపాధిహామీ, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ కింద 2023-24 సంవత్సరానికి గానూ జరిగిన పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ నిర్వహించారు. గత వారం రోజులుగా తనిఖీ బృందం పలు గ్రామాల్లో పర్యటించి తనిఖీలు నిర్వహించారు. 616పనులకు సంబంధించిన రూ.5.23కోట్లతో చేపట్టిన పనుల వివరాలను పరిశీలించారు. ఈ ప్రజావేదిక కార్యక్రమంలో తనిఖీ బృందం, పంచాయతీ కార్యదర్శులు తప్ప ఎవరూ హాజరుకాకపోవడంతో కుర్చీలే దర్శనమిచ్చాయి. కార్యక్రమంలో ప్రొసైడింగ్ అధికారి శిరీష, అదనపు డీఆర్‌డీవో వెంకటపతి రాజు, ఎంపీడీవో నాగేశ్వరరావు, శాస్త్రీ, వెంకన్న, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పట్టుబడిన ద్విచక్ర వాహనాల వేలం

కారేపల్లి, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): మండల ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో గురువారం మద్యం రవాణా చేస్తూ పట్టుబడిన ద్విచక్రవాహనాలకు అధికారులు వేలం పాట నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా అసిస్టేంట్ కమిషన్‌ర్ వి.వేణుగోపాలరెడ్డి సమక్షంలో నిర్వహించిన ఈ వేలంలో పాటదారులు పోటిపడి దక్కించుకున్నారు. ఈసందర్భంగా ఏఎస్‌ఐ బేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అనేక స్టేషన్‌లలో పట్టుబడిన అనేక వాహనాలకు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాహదారుల మద్యాన్ని ఇతర ప్రాంతాల నుంచి రవాణా చేయడం నేరమన్నారు. కార్యాక్రమంలో సీఐ స్రవంతి, ఎస్ఐ వసంతలక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

అడవిని తలపిస్తున్న రహదారులు

» రహదారులపై ఏపుగా పెరిగిన చెట్లు » పట్టించుకోని అధికారులు



లింగాల నుంచి ఎర్రబోయినపల్లి రహదారిపై అడవిని తలపిస్తున్న చెట్లు

కల్లూరు, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలంలోని పలు గ్రామాల్లోని ప్రధాన రహదారులపై ఇరువైపుల పిచ్చి మొక్కలు, కంప వృక్షాలు ఏపుగా పెరిగి దట్టమైన అడవిలా తలపిస్తున్నాయి. దీంతో మండలంలోని పలు గ్రామాలకు అనుసంధానంగా గల రహదారులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. మరోవైపున రహదారులకు ఇరువైపుల పిచ్చిమొక్కలు, చెట్లు ఏపుగా పెరగడంతో విస్తీర్ణం (వెడల్పు) తగ్గిపోతుంది. మండల పరిధిలోని తాళ్లూరు, వెంకటాపురం, పోచారం, యర్రబోయనపల్లి, లింగాల, పాయాపూరు, చంద్రుపట్ల, రఘునాథబంజర, కప్పలంధం నుంచి కల్లూరు, పుల్లయ్యబంజరు నుంచి లోకవరం, తెలగారం నుంచి మర్లపాడు, నారాయణపురం నుంచి పేరువంచ, కల్లూరు నుంచి కిష్టయ్యబంజర, కల్లూరు నుంచి లక్ష్మీపురం తదితర గ్రామాలకు అనుసంధానంగా గల ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖల పరిధిలో గల రహదారులపై పిచ్చి మొక్కలు, చెట్లు పెరిగి కమ్మేస్తున్నాయి. సంబంధిత శాఖల అధికారులు ఏమాత్రం పట్టించుకొని పరిస్థితి నెలకొన్నది. మండల పరిధిలో పలు గ్రామాలకు అనుసంధానంగా ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలకు పరిధిలో సుమారు 200 కిలోమీటర్ల పోడవున విస్తరించి ఉండగా అందులో 50 కిలోమీటర్ల పొడవునా ఇరువైపుల కంప చెట్లు పెరిగాయి. ఈ పరిస్థితుల్లో రహదారులపై పగలే వెళ్లాలన్న పాదచారులకు, ద్విచక్రవాహనదారులకు భయానకంగా ఉందంటున్నారు. ఇకరాత్రి పూట రహదారులపై వాహనాదారులు వెళ్లాలంటే బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సి వస్తోందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. అసలే రహదారులపై గుంతుల ఏర్పడి నెర్రలు ఇచ్చాయి. దీనికి తోడు కంప వృక్షాలు, పిచ్చిమొక్కలు పెరడంతో కాలక్రమంలో రహదారులకు ఇరువైపుల ఆరు అడుగుల విస్తీర్ణంలో అవి కమ్మేశాయి. గ్రామాలకు మంత్రులు, పర్యటనల సమయంలో మాత్రమే అధికార యంత్రాంగం వాటిని తొలిగిస్తారు. ఇక ఆ తరువాత పట్టించుకున్న దఖాలాలు లేవని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధింత అధికారులు స్పందించి రహదారులపై పెరిగిన చెట్లను తొలిగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

పెనుబల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ఎరువులు, పురుగుమందుల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి డి.పుల్లయ్య గురువారం పరిశీలించారు. ఫెర్టిలైజర్ ఇన్వెన్టరీ వెరిఫికేషన్ సిస్టమ్ యాప్‌లో నమోదు చేయటానికి తనిఖీలు చేశారు. డిజిటల్ క్రాప్ సర్వే యాప్‌లో పంటల నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. సత్తుపల్లి ఏడీఏ వేమిరెడ్డి శ్రీనివాస రెడ్డి, ఏవో ఏపీఎస్.ప్రసాదరాజు పాల్గొన్నారు.



ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న జేడీఏ పుల్లయ్య

రైతులందరికీ నష్ట పరిహారం అందించాలి



ఖమ్మంపాడు రైతువేదిక వద్ద నిరసనలో పాల్గొన్న నాయకులు

మధిరరూరల్, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): తుఫాన్, వరదలతో నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందించాలని కోరుతూ గురువారం ఖమ్మంపాడు గ్రామంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో రైతువేదిక వద్ద రైతులకు నిరసన తెలిపారు. ఈసందర్భంగా సీపీఎం నాయకులు మందా సైదులు, వెంకటనరసయ్య, లాలు అమరయ్యలు మాట్లాడుతూ గ్రామంలో తుఫాన్‌తో తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాల్సింది పోయి, నష్టం జరగని రైతులకు నష్టపరిహారం అందించడం దారుణమన్నారు. నష్టం జరిగిన రైతులకు మొండిచేయి చూపించారని ఆరోపించారు. తప్పుడు రిపోర్టులు పంపించిన అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులను ఆదుకోవాలని కోరారు. అర్హత కలిగిన రైతులకు నష్టపరిహారం అందించాలనే డిమాండ్‌తో కూడిన వినతిపత్రాన్ని ఏఈవోకు అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మంద సైదులు, బడిత్యలాలు, అంగడాల అమరయ్య, వైకుంతపు వెంకటేశ్వరరావు, ములుగు బ్రహ్మాచారి, కంచం కృష్ణ, షేక్ సైదులు, దొండపాటి వెంకటరామయ్య, మాజీ ఎంపీటీసీ యేసుమణి తదితరులు పాల్గొన్నారు.

వరి పంటల పరిశీలన

ముదిగొండ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మపేటలో పత్తి, మిర్చి, వరి పంటలను మధిర ఏడీఏ స్వర్ణ విజయ చంద్ర గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ పంటలలో రసంపీల్చే పురుగులు ఆశించినట్లు గుర్తించామన్నారు. వాటి నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో నారాయణ, ఏఈవోలు ఇందు భవాని, రమేష్, రైతులు ఉన్నారు.



పత్తి పంటను నమోదును పరిశీలిస్తున్న అధికారులు

అనారోగ్యంతో బీఆర్ఎస్ నేత రంగారావు మృతి



తాతా రంగారావు

వైరా, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వైరా మండలంలోని తాటిపూడి గ్రామంలో బీఆర్ఎస్ సీనియర్ నేత, గ్రామ మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ అయిన తాతా రంగారావు(78) అనారోగ్యంతో గురువారం ఖమ్మంలో మృతి చెందారు. ఆయన వైరా సొసైటీ అధ్యక్షుడిగా ఐదు సంవత్సరాలు పనిచేశారు. మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు ప్రధాన అనుచరుడైన తాతా రంగారావు 1984లో తెలుగుదేశంలో చేరారు. 1988నుంచి 1995వరకు తాటిపూడి సర్పంచ్‌గా, 2006నుంచి 2011వరకు ఎంపీటీసీగా, 2014నుంచి 2019వరకు వైరా విశాల సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన టీడీపీలోనే ఈ పదవులు నిర్వహించారు. 2001లో జడ్పీటీసీగా పోటీచేసి ఓటమిపాలయ్యారు. ఆగ్రామంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల కోసం ప్రభుత్వానికి టీడీపీ హయాంలో తమ భూములను ఇచ్చారు. 2014లో తుమ్మల, కొండబాలతోపాటు బీఆర్ఎస్‌లో చేరారు. ప్రస్తుతం ఆయన అదే పార్టీలో కొనసాగుతున్నారు. రంగారావుకు భార్య, ముగ్గురు కుమారులున్నారు. రంగారావు భౌతిక కాయాన్ని మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, ఆంధ్రజ్యోతి ఖమ్మం యూనిట్ మేనేజర్ తాళ్లూరి పుల్లారావు, కృష్ణార్జునరావు, తాటిపూడి, విప్పలమడక, బట్టా పెద్దభద్రయ్య, ఇలారపు వాసు, పారుపల్లి కృష్ణారావు, మంచల జయరాజు, బొంతు రాంబాబు, తోట నాగేశ్వరరావు, కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఎం, ఇతర పార్టీల నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

పోలీసులు అధికార పార్టీ తొత్తులుగా వ్యవహరించొద్దు

» జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు



సమావేశంలో మాట్లాడుతున్న కమల్‌రాజు

మధిరటౌన్, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరించవద్దని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. గురువారం మధిరలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చింతకాని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య అయ్యప్ప దీక్షలో ఉండి, ఇంట్లో భోజనం చేస్తున్న వ్యక్తిని పోలీసులు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా అరెస్టు చేయడం అక్రమమని అన్నారు. అరెస్టు చేసిన వ్యక్తిని ఒక ఉగ్రవాదిలా పలు పోలీసు స్టేషన్లకు తిప్పడం దుర్మార్గమని పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కల్పించాల్సిన పోలీసులే అలజడి సృష్టించడం దారుణమని అన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, నాయకులు బొగ్గుల భాస్కరరెడ్డి, చావా వేణు, బొగ్గుల వీరారెడ్డి, శీలం కృష్ణారెడ్డి, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఏన్కూరు అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): తిమ్మరావుపేట గ్రామానికి చెందిన ఇసనపల్లి సాయిలు, వీరస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆర్థిక ఇబ్బందులతో ఉన్న కుటుంబాలకు ఇదే గ్రామానికి చెందిన తెలంగాణ రాష్ట్ర రవాణా అధికారి బొర్ర తిరుపతయ్య గ్రామస్థుల ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సహాయం అందించారు. ఆర్థిక సాయం అందించిన తిరుపతయ్యను గ్రామస్థులు అభినందించారు. ఈకార్యక్రమంలో ఇసనపల్లి నాగేశ్వరరావు, వెంకట్, నరసింహారావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ముదిగొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను గురువారం బాణాపురం గ్రామం వద్ద ముదిగొండ పోలీసులు పట్టుకున్నారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా, ఎటువంటి అనుమతులు లేకుండా పెద్దమండవ మున్నేరు నుంచి ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకొని, పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సీఐ మురళీ తెలిపారు. ఈమేరకు ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తీసకుంటామని హెచ్చరించారు.

విద్యుత్ మోటార్ల చోరీ

చింతకాని, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాఘవాపురం గ్రామంలో మూడు వ్యవసాయ విద్యుత్ మోటార్లను బుధవారం రాత్రి దొంగలు దొంగిలించారు. ఘటనకు సంబంధించి రైతు వడ్డే పుల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేంసూర్‌లో విద్యుత్ వైర్లు....

వేంసూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వేంసూరు మండలంలో తరచూ విద్యుత్ వైర్లు చోరీకి గురవుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల వేంసూరు ఎత్తిపోతల పథకానికి సంబంధించిన నాలుగు 630కేవీ ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి వైర్, 100కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైర్లు చోరీకి గురయ్యాయి. రాగి వైర్‌లు చోరీకి గురికావడం వల్ల సుమారు రూ.40లక్షల మేర నష్టం జరిగింది. భీమవరం, వేంసూరు, మర్లపాడు, రాయుడుపాలెం, కల్లూరుగూడెం, గూడూరు గ్రామాల్లోని 150మోటర్లలోని కేబుల్ వైర్లను చోరీ చేశారు. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ చోరీలకు పాల్పడుతున్న దుండగులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

'అమరవీరుల ఆశయాలు సాధించాలి'



ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సత్తుపల్లి, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): అమరవీరుల ఆశయాలు సాధించాలని బెటాలియన్ కమాండెంట్ పీజేపీసీ.చటర్జీ తెలిపారు. పోలీస్ ఫ్లాగ్ డే-2024దినోత్సవాలలో భాగంగా మండలంలోని గంగారంలోని 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ పోలీసులు, సత్తుపల్లి పట్టణ పోలీసులు సంయుక్త ఆధ్వర్యంలో గంగారం గ్రామం నుంచి సత్తుపల్లి పట్టణం వరకు గురువారం ద్విచక్రవాహనాల ర్యాలీ నిర్వహించారు. శాంతిభద్రతలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంలో పోలీసులది కీలక పాత్ర అని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతూ ప్రజలకు రక్షణ కల్పించడంలో ముందుండేది పోలీసులేనన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ ఎస్‌డీ.రంగారెడ్డి, ఆఫీసర్లు, పట్టణ పోలీసులు పాల్గొన్నారు.

విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి

● వైరా ఏడీఏ కరుణశ్రీ

వైరా, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలని వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. వైరా డివిజన్ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన రైతులు కంపెనీ అగ్రిమెంట్ బాండ్ లేకుండా విత్తన మొక్కజొన్న సాగు చేయవద్దని సూచించారు. వైరా, కొణిజర్ల, ఏన్కూరు, సింగరేణి మండలాల్లో రైతులు హైబ్రీడ్ మొక్కజొన్న విత్తన ఉత్పత్తి సాగుచేస్తున్నారని పేర్కొన్నారు. మొక్కజొన్న విత్తనోత్పత్తి చేస్తున్న రైతులు సంబంధిత కంపెనీ అగ్రిమెంట్ బాండ్ విధిగా తీసుకోవాలని సూచించారు. ప్రైవేట్ కంపెనీకి చెందిన అగ్రిమెంట్ బాండ్ లేనట్లయితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ విత్తన ఉత్పత్తి సాగుచేయవద్దని స్పష్టం చేశారు. ఒకవేళ ఏదైనా కారణాల వలన పంట నష్టం జరిగితే రైతులకు పరిహారం లభించేలా కంపెనీ అగ్రిమెంట్ బాండ్ దోహదపడుతుందని తెలిపారు. అందుకు విరుద్ధంగా రైతులకు కంపెనీ వారు అగ్రిమెంట్ బాండ్ ఇవ్వకుండా రైతులతో మొక్కజొన్న విత్తనోత్పత్తి సాగు చేయిస్తే సంబంధిత కంపెనీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'కంపచెట్లు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వినతి'



ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న రైతులు

కల్లూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎర్రబోయినపల్లి గ్రామంలో పంట పొలాలకు వెళ్లనీయకుండా రహదారికి అడ్డంగా కంపచెట్లు వెస్తున్న వారిపై చర్యలు తీసుకోవాల ని పలువురు రైతులు ఆర్డీవో కార్యాలయంలో గురువారం ఫిర్యాదు చేశారు. రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ పొలం క్రయ విక్రయంలో దోమతొట్టి రామకృష్ణ అనే రైతు పంట పొలాలకు రైతులను వెళ్లనీయకుండా అడ్డంగా కంపచెట్లు వేస్తున్నాడని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కల్లూరు మండల తహసీల్దార్, ఎస్ఐలకు కూడా బాధిత రైతులు ఫిర్యాదు చేశారు.

ఆలయాల నిర్మాణ స్థలాలకు రూ.2 లక్షల వితరణ

కల్లూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో ఆలయ నిర్మాణాల స్థలాల కొనుగోలు కోసం కల్లూరుకు చెందిన దాతలు తమ వంతుగా రూ. 2,15,116 లక్షలు వితరణ చేసేందుకు గురువారం ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా కల్లూరులోని జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పసుమర్తి చందర్‌రావు సమక్షంలో కల్లూరుకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు (లేటు) చిక్కుల అప్పయ్య కుమారులు వెంకట రామారావు, రమేష్, మురళీకృష్ణలు తమ వంతుగా రూ.2,15,116 లక్షలు విరాళంగా అందించేందుకు ముందుకు వచ్చారు. సేవలాల్, మేరమ్మ మందిర నిర్మాణాలకు దాతలు ఆర్థిక సహాయం అందించనున్నారు. దాతలకు గుగులోతు కృష్ణ, ఇస్లావత్ దీప్లా, గుగులోతు ప్రసాద్, మందపాటి మాధవరెడ్డి, భూక్యా వీరప్రసాద్‌లు కృతజ్ఞతలు తెలిపారు.